


ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
శుక్రవారం, 25 ఏప్రిల్ 2025



28న 'దిశ' సమావేశం

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : కేంద్రప్రభుత్వ పథకాలపై జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశాన్ని ఈనెల 28న కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. 28 సోమవారం మధ్యాహ్నం 2.30 గంటలకు ఐడీఓసీ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈసమావేశానికి ఖమ్మం పార్లమెంట్ సభ్యులు దిశ కమిటీ చైర్మన్ రామసహాయం రఘురాంరెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు, కేంద్రప్రభుత్వ పథకాలను అమలుచేస్తున్న శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

వైరా కాల్వల ఆధునీకరణ

పనులకు నేడు భూమి పూజ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వైరా, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): వైరా రిజర్వాయర్ కుడి, ఎడమకాల్వల ఆధునీకరణ పనులకు శుక్రవారం వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ భూమిపూజ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రూ.42.10 కోట్ల నిధులతో కుడి, ఎడమకాల్వల్లో ఆధునీకరణ పనులకు టెండర్లు, కాంట్రాక్టర్‌తో అగ్రిమెంట్ ప్రక్రియ పూర్తయి కొన్ని నెలలవుతున్నా ఇంతవరకు ఆధునీకరణ పనులు చేపట్టలేదు. ఈ ఏడాది పనులు చేసేందుకు కేవలం రెండు నెలల వ్యవధి మాత్రమే ఉంది. ఇదే విషయమై ఈనెల 15న 'మిగిలింది రెండు నెలలే' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించింది. ఆ వెంటనే అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించారు. ఈ కాల్వల ఆధునీకరణ పనుల కోసం రిజర్వాయర్ కుడి, ఎడమ కాల్వల ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీటి సరఫరా చేయలేదు.

కేవలం పదివేల ఎకరాల ఆయకట్టులోనే ఖరీఫ్ సేద్యం చేశారు. 10 నుంచి 15వేల ఎకరాల (మిగతా 4వ పేజీలో)

ఖమ్మం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కేంద్ర జలసంఘం సీతమ్మసాగర్, సీతారామ ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అనుమతులను క్లియర్ చేసిందని, ఇటు ఖమ్మం, అటు భద్రాద్రికొత్తగూడెం జిల్లాల్లో 7లక్షలపైగా ఎకరాల భూములకు సాగునీరుఅందించి తీరుతామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమం ద్వారా బీఆర్ఎస్, బీజేపీ చేస్తున్న తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలని కార్యకర్తలు, నాయకులకు విజ్ఞప్తి చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు త్వరలోనే రాబోతున్నాయి. ఎన్నికలకు సిద్ధంగా ఉండండి... జరిగే ప్రతి ఎన్నికలోనూ కాంగ్రెస్‌జెండా ఎగరాలి.. స్థానిక సంస్థల కుర్చీలలో కార్యకర్తలే కూర్చోవాలి.. అని విజ్ఞప్తిచేశారు.

ఖమ్మంలోని మంత్రి క్యాంపు కార్యాలయ ఆవరణలో గురువారం ఖమ్మం నియోజకవర్గ కార్యకర్తలు, నాయకుల సమావేశం జరిగింది.



ఖమ్మంలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

ఉమ్మడి జిల్లాను సస్యశ్యామలం చేస్తాం...

సీతారామ, సీతమ్మ సాగర్‌లకు కేంద్ర జలసంఘం అనుమతి

- స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కండి
- అన్ని చోట్లా కాంగ్రెస్ జెండానే ఎగరాలి
- జైబాపు, జైభీమ్ కార్యక్రమం ద్వారా తప్పుడు ప్రచారం తిప్పికొట్టండి
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఈ సమావేశంలో మంత్రి తుమ్మల ప్రసంగిస్తూ జై బాపు, జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమం ద్వారా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ప్రతిపక్షాలు చేస్తున్న తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలని, 14 నెలలుగా రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పేర్కొన్నారు. పార్టీలో పనిచేస్తున్న ప్రతీ ఒక్కరికి కేరక్టర్ ముఖ్యమని, అది లేకపోతే డబ్బులు పెట్టినా, గాలి వీచినా ప్రజలు నమ్మి ఓట్లు వేయరని, వారికి ఓటమి తప్పదన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో రెండు తెలుగురాష్ట్రాల్లో గత ప్రభుత్వ పాలకులకు కేరక్టర్ లేకపోవడంతోనే ఓటమి చూడాల్సి వచ్చిందని ఇది ప్రతీ ఒక్కరు గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. రాహుల్‌గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు 4400 కి.మీ. మండే ఎండల్లో పాదయాత్ర చేసి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకున్నారని, కార్యకర్తలు కూడా ప్రజల్లో ఉన్నప్పుడే ప్రజలు పార్టీవైపు ఉంటారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దావోస్ వెళ్లి రూ.లక్ష కోట్లు పెట్టుబడులు తెచ్చారని, జపాన్ వెళ్లి రూ.12వేల కోట్లు తెచ్చి అభివృద్ధి చేస్తున్నారని, నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తున్నారని తెలిపారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన జైబాపూ, జైబీమ్ కార్యక్రమాన్ని ప్రతీ ఒక్కరు ప్రజల్లోకి తీసుకెళ్లాలని, పార్టీ పదవుల్లో ఉండి ఎవరైనా కార్యక్రమాలు నిర్వహించకుండా ఉంటే వారిని తొలగించి కొత్తవారిని నియమించడం జరుగుతుందన్నారు. రాజ్యాంగపరంగా, న్యాయపరంగా కేంద్ర ప్రభుత్వం కులగణన రిజర్వేషన్ల విషయంలో సహకరించకపోయినా తమ ప్రభుత్వం అమలుచేసి తీరుతుందని తెలిపారు. అతిత్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నాయని, దీనిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి త్వరలో నిర్ణయం తీసుకుంటున్నారని, క్షేత్రస్థాయిలో నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండి వచ్చే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరేయాలని, కాంగ్రెస్ కార్యకర్తలే స్థానిక సంస్థల కుర్చీలలో కూర్చోవాలని, ఇందుకు క్రమశిక్షణతో పనిచేయాలని సూచించారు.

కేంద్ర జలసంఘం అనుమతులు

సీతమ్మసాగర్, సీతారామ ప్రాజెక్టులకు సంబంధించి కేంద్ర జలసంఘం నుంచి అనుమతులు లభించాయని, రాబోయే మూడేళ్లలో పనులన్ని పూర్తిచేసి తీరుతామని తద్వారా ఇటు ఖమ్మం, ఇటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలు సస్యశ్యామలం అవుతాయని మంత్రి ప్రకటించారు. 'కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం జరుగుతుండగానే నాకు సమాచారం అందింది.. ఇది శుభపరిణామం.. సీతమ్మసాగర్ పూర్తయితే 66 టీఎంసీల గోదావరి జలాలు నిల్వ ఉండి 7లక్షల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉంటుంది.. రాబోయే కాలంలో ప్రతిఏటా ఎక్కువ ఆయకట్టుకు నీరందించేలా చర్యలు తీసుకుంటాం..' అని తెలిపారు.

రూ.2202 కోట్లతో అభివృద్ధి పనులు

ఖమ్మం నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 14 నెలల కాలంలోనే 2202 కోట్లతో (మిగతా 4వ పేజీలో)

సాకారం కానున్న సాగునీటి స్వప్నం

- సీతమ్మ సాగర్ బ్యారేజీ, సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టుకు కేంద్ర జలసంఘం గ్రీన్‌సిగ్నల్
- డీపీఆర్‌కు అనుమతులు ఇచ్చిన టీఏసీ
- వేగవంతం కానున్న రెండు ప్రాజెక్టుల పనులు
- సీఎం రేవంత్‌రెడ్డికి మంత్రి తుమ్మల కృతజ్ఞతలు



కొత్తగూడెం/ఖమ్మం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు గోదావరిపై దుమ్ముగూడెం వద్ద నిర్మిస్తున్న సీతమ్మ సాగర్ బ్యారేజీ పనులకు, ఇప్పటికే ప్రారంభించిన సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టుకు డీపీఆర్ అనుమతులు ఎట్టకేలకు లభించాయి. కేంద్ర జలసంఘం సాంకేతిక సలహాకమిటీ (టీఏసీ) దీనికి సంబంధించి అనుమతులను గురువారం ఇచ్చిందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఇందుకు కృషిచేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాతోపాటు మహబూబాబాద్ జిల్లా రైతాంగానికి సీతారామ ప్రాజెక్టు ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు.

2023 జనవరి 27న సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుతో పాటు సీతమ్మ సాగర్ బహుళార్థక ప్రాజెక్టు పెండింగ్‌లో ఉన్న డీపీఆర్ అనుమతుల కోసం కేంద్ర జలసంఘానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసిందన్నారు. దీనిపై పలుమార్లు సమావేశాలు నిర్వహించి ప్రాజెక్టుకు అనుమతులు ఇస్తూ టీఏసీ నిర్ణయం తీసుకుందని మంత్రి వివరించారు. ఈ ప్రాజెక్టు ద్వారా మూడు జిల్లాల్లో 11 నియోజకవర్గాల్లో 4,15,620 ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరందుతుందని, అలాగే 3,78,068 ఎకరాలకు స్థిరీకరణ జరుగుతుందని తెలిపారు.

సెంట్రల్ వాటర్ కమిషన్ హైడ్రాలజీ డైరెక్టరేట్ నుంచి 67.05 టీఎంసీ సాగునీటికి, తాగునీటి కోసం 2.12 టీఎంసీ అనుమతి ఇవ్వడం జరిగిందని, ఎవాపరేషన్‌కు 1.80 టీఎంసీలకు అనుమతులు (మిగతా 4వ పేజీలో)



సత్తుపల్లిలో మాట్లాడుతున్న మార్తినేని ధర్మారావు

ఉగ్రదాడి పాకిస్థాన్ కుట్ర

- కశ్మీర్‌లో పర్యాటక రంగాన్ని దెబ్బ తీయడమే వారి లక్ష్యం
- పహల్గాం హత్యాకాండకు నిరసనగా రేపు దేశవ్యాప్త బంద్
- బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మార్తినేని ధర్మారావు

సత్తుపల్లి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఆర్టికల్ 370 ఏర్పడిన తర్వాత జమ్మూకశ్మీర్‌లో నెలకొన్న శాంతియుత వాతావరణాన్ని, అలాగే అభివృద్ధి చెందుతున్న పర్యాటక రంగాన్ని దెబ్బతీసేందుకు పాకిస్థాన్ కుట్ర చేయడం దుర్మార్గమని బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు అన్నారు. సత్తుపల్లి ఎన్టీఆర్ నగర్‌లోని బీజేపీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మూడున్నర ఏళ్లలో జమ్మూకశ్మీర్‌లో 1.7కోట్ల మంది టూరిస్టులు విజిట్ చేశారని, 137 సినిమాలు షూటింగ్ జరుపుకొన్నాయని తెలిపారు.

ఆర్టికల్ 370 తర్వాత సింగిల్ బుల్లెట్ ప్రభుత్వం వాడలేదని, అభివృద్ధి ఫలాలు ఆ ప్రాంతంలో అందుతున్నాయని, అక్కడివారికి ఉద్యోగాలు వచ్చాయని, ప్రశాంత వాతావరణాన్ని ఉగ్రవాదం (మిగతా 4వ పేజీలో)

చకచకా నయా మార్కెట్ నిర్మాణం

ఖమ్మం మార్కెట్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్ అత్యాధునిక హంగులతో రూపుదిద్దుకోబోతుంది. రూ. 155 కోట్ల నిధులతో నయా మార్కెట్‌గా అవతరించబోతుంది. ఈ మేరకు ఆధునిక వసతులతో ఇటీవలే యార్డులకు సంబంధించిన రీమోడలింగ్ పనులు ప్రారంభమయ్యాయి. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం మేరకు ఖమ్మం వ్యవసాయ మార్కెట్ నిర్మాణం అంతర్జాతీయ స్థాయిలో ఉండాలని, ఇతర మార్కెట్‌లకు ఆదర్శంగా ఖమ్మం మార్కెట్‌ను ఉంచాలనే పట్టుదలతో ప్రత్యేక చొరవతో మోడల్ మార్కెట్‌ను చకచకా నిర్మిస్తున్నారు. గత డిసెంబరు, జనవరి నెలల్లో మార్కెట్‌లోని చిన్న మిర్చి యార్డు, అపరాల యార్డుల్లో ఉన్న పాత షెడ్లతో పాటు, మార్కెట్‌ను ఆవరణలో ఉన్న పాత వేర్ హౌస్ గోదాములను కూల్చి మార్కెట్ స్థలాన్ని విశాలంగా తయారు చేశారు. పనులను అంతర్జాతీయ స్థాయిలో కాంట్రాక్టు చేసే ఎజిలిటి సంస్థ దక్కించుకుంది. నూతనంగా నిర్మించే మార్కెట్ యార్డులో రైతులకు, వ్యాపారులకు పంట దిగుమతి, ఎగుమతి విషయంలో ఎటువంటి ఇబ్బంది లేకుండా విశాలంగా ఉండేలా చర్యలు తీసుకున్నారు. రైతులకు కావాల్సిన మౌలిక వసతుల కోసం నాలుగు అత్యాధునిక పద్ధతుల్లో 4కాంపౌండ్ బ్లాకుల్లో మరుగుదొడ్లు, తాగునీటికి సంబంధించి నాలుగు ఆర్వో ప్లాంట్లు నిర్మించనున్నారు. అంతేకాకుండా యార్డులకు నాలుగు వైపులా హై సెక్యూరిటీ గల ధ్రుఢమైన గేట్లు, 4 హై కెపాసిటీ గల వేబ్రిడ్జిలు నిర్మించనున్నారు.

6 విశాలమైన షెడ్ల నిర్మాణం

సుమారు 11 ఎకరాలు ఉన్న మార్కెట్ స్థలంలో విశాలమైన 6 షెడ్లు నిర్మిస్తున్నారు. ఒక్కో షెడ్డు 121 మీటర్ల పొడవు, 27 మీటర్ల వెడల్పు ఉంటుంది. లక్ష బస్తాల కెపాసిటీ గల ఒక కోల్డ్ స్టోరేజీని సైతం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించేందుకు నిర్మిస్తుండటం విశేషం. వర్షపు నీరు పోవడానికి ప్రహరీ బయట ఒక డ్రెయినేజీ, మార్కెట్‌లోపల ఒక డ్రెయినేజీని నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది జనవరి నెలలో అధునాతన మోడల్ మార్కెట్ అందుబాటులోకి రానుంది.



షెడ్ల నిర్మాణం కోసం పిల్లర్లు నిర్మిస్తున్న దృశ్యం





షెడ్ల నమూనా

- రూ.155 కోట్ల అంచనా వ్యయంతో కొనసాగుతున్న పనులు
- నూతన సాంకేతిక వసతులతో యార్డుల నిర్మాణం
- అంతర్జాతీయ స్థాయిలో నిర్మించేందుకు మంత్రి తుమ్మల పట్టుదల
- లక్ష బస్తాల కెపాసిటీ గల కోల్డ్‌స్టోరేజీ కూడా
- వచ్చే ఏడాది జనవరి కల్లా మోడల్ మార్కెట్ అందుబాటులోకి

రైతులకు ఎంతో ఉపయోగకరం

యరగర్ల హన్మంతరావు, మార్కెట్ కమిటీ చైర్మన్



అత్యాధునిక హంగులతో నిర్మించే మార్కెట్ రైతులకు వరంగా ఉంటుంది. వారి పంట విక్రయాలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుంది. రైతులకు, వ్యాపారులకు, కార్మికులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవ చూపి మార్కెట్‌ను అభివృద్ధి చేస్తున్నారు. మార్కెట్‌ను మోడల్ మార్కెట్‌గా నిర్మిస్తున్న రాష్ట్ర మంత్రి తుమ్మలకు రైతుల పక్షాన ప్రత్యేక అభినందనలు.





భగ్గుమంటున్న భానుడు

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 43.1డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- మండుతున్న ఎండలు.. అల్లాడుతున్న జనం
- సింగరేణి ప్రాంతాల్లో మరింత తీవ్రం

కొత్తగూడెం టౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): భానుడు భగ్గుమంటుండటంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రజలు అల్లాడిపోతున్నారు. సూర్యుడు ఉదయం నుంచే తన ప్రతాపాన్ని చూపుతుండటంతో జనం ఇబ్బందులకు గురవుతున్నారు. ఉదయం 7 గంటల నుంచే ఎండతీవ్రత పెరుగుతోంది. మధ్యాహ్నం సమయంలో రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. భద్రాచలంలో గురువారం 43.1 ఉష్ణోగ్రత నమోదు కాగా, అశ్వాపురం, లక్ష్మీదేవిపల్లి, పాల్వంచ, మండలాల్లో 43.0 ఉష్ణోగ్రత నమోదైంది. కరకగూడెంలో 42.9, చుంచుపల్లి, సుజాతనగర్, కొత్తగూడెం, మణుగూరులో 41.7, దుమ్ముగూడెంలో 41.6, గుండాల 41.5 డిగ్రీలుగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సింగరేణి మైన్స్, ఓపెన్‌కాస్టు ఏరియాల్లో ఎండ తీవ్రత అధికంగా ఉంటోంది. వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని సింగరేణి ఓపెన్‌కాస్టు కార్మికుల వేళల్లో మార్పులు చేయాలని సింగరేణి కార్మిక సంఘాల నాయకులు కోరుతున్నారు.

అసలే ఎండ తీవ్రత అధికంగా ఉంటే.. అప్రకటిత విద్యుత్‌కోత వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మధ్యాహ్నం సమయంలో (మిగతా 4వ పేజీలో)

ఎరుపెక్కిన నగరం

- నేటి నుంచి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఐదో మహాసభలు
- మూడు రోజులపాటు విద్యార్థి ఉద్యమాలపై వ్యూహరచన
- హాజరుకానున్న జాతీయ నాయకత్వం

ఖమ్మం సంక్షేమ విభాగం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఉద్యమాలకు పురిటిగడ్డ ఖమ్మం ఖిల్లాపై భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర మహాసభల జెండా ఎగరనుంది. మూడు రోజులపాటు నిర్వహించే తెలంగాణ రాష్ట్ర ఎస్ఎఫ్ఐ ఐదో మహాసభలకు ఖమ్మం నగరం ఎరుపెక్కింది. 25, 26, 27న జరిగే రాష్ట్ర మహాసభలకు భారీగా ఏర్పాట్లు చేశారు. ముఖ్యంగా రాష్ట్రంలో ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతంపై సమీక్షించనున్నారు. ప్రభుత్వ విద్యావ్యవస్థ పరిరక్షణపై తీర్మానాలు చేయనున్నారు. ప్రభుత్వ యూనివర్సిటీలు బలోపేతం చేయాలని, ప్రైవేటు, కార్పొరేట్ వ్యవస్థలో ఫీజుల నియంత్రణ చట్టం అమలులోకి తీసుకరావాలని నినదించనున్నారు. జాతీయ నూతన విద్యా విధానం తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయకుండా అసెంబ్లీలో తీర్మాణం ఆమోదించాలని, అలాగే పెండింగ్ ఫీజులు, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని, బాలికల రక్షణకు చట్టాలను తీసుకరావాలని ప్రభుత్వానికి డిమాండ్‌లు తెలపనున్నారు. పీజీ విద్యార్థులకు నెలకు రూ.10వేల ఉపకార వేతనాలు ఇవ్వాలని, విద్యారంగంలో టీచింగ్, నాన్ టీచింగ్ ఖాళీలను భర్తీ చేయాలని పలు డిమాండ్‌లపై చర్చలు జరపనున్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, నాయకులు

హాజరుకానున్న జాతీయ నాయకత్వం

తెలంగాణ రాష్ట్ర ఐదో మహాసభలకు జాతీయ, రాష్ట్ర నాయకత్వాలు హాజరుకానున్నాయి. శుక్రవారం ఉదయం 11 గంటలకు ఖమ్మం జడ్పీ సెంటర్ నుంచి భక్తరామదాసు కళాక్షేత్రం వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి భక్తరామదాసు కళాక్షేత్రంలో రాష్ట్ర మహాసభలు ప్రారంభం కానున్నాయి. భారత విద్యార్థి ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు వీపీ సాను, ప్రముఖ సినీ నటుడు మాదాల రవి, జాతీయ ఉపాధ్యక్షుడు నితీష్ నారాయణ్, ప్రముఖ వాగ్గేయకారుడు గోరేటి వెంకన్న,విద్యావేత్తలు మువ్వా శ్రీనివాసరావు, రవిమారుతి, ఐవీ రమణరావు, రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు, రాష్ట్ర బాలికల కన్వీనర్ ఎం.పూజ హాజరుకానున్నారు.

శ్రీసిటిలో ఓ వీధికి జవాన్ పేరు

ఖమ్మంరూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని శ్రీసిటికి చెందిన జవాన్ పేరుతో ఓ వీధికి నామకరనం చేశారు. శ్రీసిటికి చెందిన భూక్యా రమేష్ (39) జవాన్‌గా పనిచేస్తున్నాడు. 2023 జనవరి 5న అరుణాచల్ ప్రదేశ్‌లో డ్యూటీ చేస్తుండగా వారు ప్రయాణిస్తున్న జీబు బోల్తాపడి రమేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. రమేష్‌కు భార్య రేణుక, ముగ్గురు పిల్లలు ఉన్నారు. అయితే కమాండెంట్ 56 బెటాలియన్ శ్రీహరిసింగ్ ఆధ్వర్యంలో జవాన్ రమేష్ పేరుతో ఓ వీధికి నామకరణం చేశారు. దానిని డిప్యూటీ కమాండెంట్ బి.శ్రీనివాస్‌రెడ్డి, ఏదులాపురం మునిసిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ వైవి.రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథబాబు, శ్రీసీటి చైర్మన్ గరికపాటి వెంకట్రావు, కాంగ్రెస్ నాయకులు వెంకటరెడ్డి, స్థానికులు విజయ్ రెడ్డి, యశ్వంత్ చౌదరి పాల్గొన్నారు.

భూ భారతితో సమస్యలు సత్వర పరిష్కారం

- భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్
- భూ భారతితో రైతుల భూములు భద్రం
- వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్

జూలూరుపాడు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల సత్వర పరిష్కారానికి ప్రభుత్వం భూ భారతి చట్టం - 2025ను తీసుకొచ్చిందని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. గురువారం జూలూరుపాడులోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో భూ భారతిపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ జితేష్ వి పాటిల్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. చట్టంలోని కీలక అంశాల గురించి రైతులకు వివరించారు. భూమి హక్కుల రికార్డులు భూ భారతిలో ప్రజలకు అందుబాటులో ఉంటాయని, హక్కుల పూర్తి రికార్డు పారదర్శకంగా ఉంటుందని వివరించారు. రికార్డుల్లో తప్పుల సవరణలు, వారసత్వంగా వచ్చిన భూముల రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, భూ సమస్యలకు ఈ చట్టం పరిష్కారం చూపుతుందన్నారు. భవిష్యత్తు భూములకు సంబంధించి ఎలాంటి వివాదాలకు తావు లేకుండా క్షేత్ర స్థాయిలో పూర్తి విచారణ చేపట్టిన అనంతరం రైతులకు కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాలు అందించడం జరుగుతుందన్నారు. ఇంటి స్థలాలను కూడా రికార్డుల్లో నమోదు చేయడం జరుగుతుందని, కొత్త చట్టంతో ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజనేతర రైతులకు ఎలాంటి నష్టం ఉండదని, ఈ చట్టంతో మరింత ప్రయోజనం చేకూరుతుందన్నారు. త్వరలోనే జిల్లాలోని ఒక మండలాన్ని పైలెట్ ప్రాజెక్ట్‌గా తీసుకొని భూ సమస్యలను పరిష్కరించడం జరుగుతుందన్నారు. ప్రతి గ్రామంలో జూన్, జూలై నెలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

రైతుల భూములకు భద్రత: ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన భూ భారతి - 2025 చట్టంతో ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన, గిరిజనేతర రైతుల భూములకు భద్రత ఉంటుందని, ఏ రైతుకు అన్యాయం జరగదని ఆందోళనకు గురి కావద్దు అని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ అన్నారు. వీఆర్వో వ్యవస్థను గత ప్రభుత్వం తొలిగించడం వల్ల ఎన్నో ఇబ్బందులు తలెత్తాయని, రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ఈ చట్టాన్ని తీసుకోవడంతో పాటు, మళ్లీ వీఆర్వో వ్యవస్థను తీసుకొచ్చి రైతుల భూములకు భద్రత కల్పించాలన్నదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. భూ భారతిలో ఎలాంటి లోపాలు ఉన్నా తమ దృష్టికి తీసుకు వస్తే వాటిని పరిష్కరించే విధంగా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో మధు, తహసీల్దార్ స్వాతిబిందు, ఎంపీడీవో కరుణాకర్‌రెడ్డి, ఎంపీవో తులసీరాం, ఎఫ్ఆర్వో ప్రసాద్‌రావు, కాంగ్రెస్ జిల్లా నాయకులు లేళ్ల వెంకటరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్‌నాయక్, నాయకులు దుద్దుకూరి మధుసూదన్‌రావు, పొన్నెకంటి సతీష్, దొండపాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

వైద్యుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

డీసీహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు

చుంచుపల్లి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య విధాన పరిషత్‌లో వైద్యుల పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు డీసీహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని వివిధ వైద్య విధాన పరిషత్‌లో డెర్మటాలజీ-2, భద్రాచలంలో ఎంబీబీఎస్ -2, మణుగూరులో జనరల్ సర్జన్ -2, బూర్గంపాడులో ఎంబీబీఎస్ వైద్యుడు -1 మొత్తం 7 పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిన భర్తీ చేయడం జరుగుతుందన్నారు. ఆసక్తిగల వారు తమ దరఖాస్తులను వచ్చే నెల 3వ తేదీ లోగా సూపరింటెండెంట్ జిల్లా ఆస్పత్రి ప్రధాన కార్యాలయం ఐడీవోసీలో సమర్పించాలని కోరారు.

వనజీవి కుటుంబానికి సీబీఐ మాజీ జేడీ పరామర్శ



ఆర్థిక సాయం అందజేస్తున్న మాజీ జేడీ లక్ష్మీనారాయణ

ఖమ్మం రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన పద్మశ్రీ గ్రహీత వనజీవి రామయ్య ఇటీవల మృతిచెందిన విషయం విదితమే. అయితే ఆయన పెద్దకర్మ గురువారం ఆయన స్వగృహం వద్ద కుటుంబ సభ్యులు నిర్వహించారు. వనజీవి మృతి విషయం తెలుసుకున్న మాజీ సీబీఐ జేడీ లక్ష్మీనారాయణ, శ్రీచైతన్య విద్యాసంస్థల అధినేత శ్రీధర్ వారి ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వనజీవి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. వనజీవి సతీమణి జానమ్మకు జేడీ రూ.25వేల ఆర్థిక సాయం అందజేశారు. వనజీవి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అదేవిదంగా వనజీవి కూతురు సైదమ్మ, మనుమరాలు గౌతమీ కలిసి వనజీవి రామయ్య ఫొటోతో ఉన్న జూట్ బ్యాగు, ఒక మొక్కను కర్మకు వచ్చిన వారందరికి అందజేశారు. సుమారు 3 వేల మొక్కలు, బ్యాగులు పంపిణీ చేశారు.



సమస్యలను తెలుసుకుంటున్న ఐటీడీఏ పీవో

బడులు తెరిచేలోగా వసతులు సమకూరాలి

ఐటీడీఏ పీవో రాహుల్

దుమ్ముగూడెం ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): బడులు తెరిచేలోగా ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులకు పూర్తిస్థాయి సదుపాయాల కల్పనలో ఎటువంటి లోటు ఉండకూడదని ఐటీడీఏ పీవో బి.రాహుల్ అన్నారు. లక్ష్మీనగరంలోని గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నతపాఠశాలను గురువారం సందర్శించి వసతి సౌకర్యాలను పరిశీలించారు. డార్మెటరీ, డైనింగ్ హాల్, అదనపు తరగతి గదులు, వాష్‌రూంలు, ఇతర మౌలిక వసతులకు సంబంధించిన మేజర్, మైనర్ మరమ్మతుల పనులు నెల రోజుల్లోగా పూర్తి కావాలన్నారు. పాఠశాలలు, వసతిగృహాల్లో మేజర్ రిపేర్లు ఏమైనా ఉంటే హెచ్ఎం, వార్డెన్లు సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను పిలిచి ప్రతిపాదనలను తయారు చేయించాలన్నారు. బడులు తెరిచే సమయానికి ముందే ప్రతీ పాఠశాల, వసతిగృహం సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. ఆర్వో ప్లాంటు, బోర్లు, మిషన్ భగీరథ పైపులైనుల్లో మరమ్మతులుంటే త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. విద్యుత్ సమస్య లేకుండా చూడాలని, నీరు నిల్వ ఉండే చోట పంచాయతీరాజ్‌శాఖ ద్వారా ఇంకుడు గుంతల నిర్మాణానికి ప్రతిపాదనలను సిద్ధం చేయాలన్నారు. ప్రస్తుత వేసవి సెలవుల్లోనూ పాఠశాలను ప్రతీరోజూ శుభ్రపరిచేందుకు సిబ్బందిని ఏర్పాటు చేయాలన్నారు. హెచ్ఎం సావిత్రి, డీఈ హరీష్, ఏఈ రవి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కర్రెగుట్టల్లో భారీ కూంబింగ్

ఎన్‌కౌంటర్‌తో సరిహద్దు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు అప్రమత్తం

కొత్తగూడెం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ - ఛత్తీస్‌గడ్ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లోని కర్రెగుట్టల్లో పోలీసులు భారీ బలగాలతో కూంబింగ్ గత రెండు రోజుల నుంచి నిర్వహిస్తున్నారు. కర్రెగుట్టలో ఆపరేషన్ మొదలైంది. గురువారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. దీంతో సరిహద్దు జిల్లా అయిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని చర్ల, ములుగు జిల్లాలోని వాజేడు, వెంకటాపురం, దుమ్ముగూడెం తదితర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున పోలీసులు అప్రమత్తమయ్యారు. తెలంగాణ సరిహద్దు ప్రాంతాలు దిగ్బంధమయ్యాయి. కేంద్ర బలగాలు కర్రెగుట్ట ప్రాంతాల్లో మందుపాతర్లను గుర్తించి నిర్వీర్యం చేస్తున్నాయి. ఛత్తీస్‌గడ్ రాష్ట్రం నుంచి మావోయిస్టులు తెలంగాణ ప్రాంతాల్లోకి రాకుండ ఉండేందుకు ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. ఆపరేషన్ కగార్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన మావోయిస్టుల ఏరివేత కార్యక్రమంతో జిల్లా పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. ఆ ప్రాంతాల్లో ఉన్న రహదారులను మూసివేసి అడుగడుగున పోలీసులు దిగ్బంధాన్ని చేపట్టారు. కర్రెగుట్టలు భద్రాద్రికొత్తగూడెం జిల్లాలోని చర్ల, దుమ్ముగూడెం ప్రాంతాల్లో అతి సమీపంలో ఉన్నాయి. ములుగు జిల్లాలోని వాజేడు, వెంకటాపురం మండలాలు సైతం భద్రాద్రి జిల్లా సరిహద్దులో ఉండటంతో ఎట్టి పరిస్థితుల్లోనూ మావోయిస్టులు తెలంగాణ రాష్ట్రంలోకి రాకుండా ఉండేందుకు పోలీసు బలగాలను అప్రమత్తం చేశారు. ఆయా ప్రాంతాల్లో రాకపోకలు కొనసాగించకుండా చెక్‌పోస్టులను సైతం సరిహద్దు ప్రాంతాల్లో ఏర్పాటుచేసి పోలీసులు వచ్చే వాహనాలను 24 గంటలపాటు తనిఖీలు నిర్వహిస్తున్నారు. కర్రెగుట్టలో బాంబుల మోతతో దద్దరిల్లడంతో ఆయా ప్రాంతంలో ఉన్న భీమారం పాడు గ్రామంలో ఏర్పాటు చేసిన పోలీసు బేస్‌క్యాంపు నుంచి ముందుకు వెళ్లడానికి వీలు లేకుండా నిలిపివేశారు. గ్రామస్థులు కూడా ఆ ప్రాంతంలోకి రాకుండ కట్టుదిట్టమైన చర్యలు చేశారు. ఎవరు ఇళ్ల నుంచి బయటకు రావొద్దని సూచిస్తున్నారు. ఛత్తీస్‌గడ్‌లోకి పూజారి కంకేరీ వైపు బలగాలు రహదారులను దిగ్బంధం చేసి పోలీసులు అప్రమత్తం చేశారు. చర్ల, ములుగు, వాజేడు, వెంకటాపురం, పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేస్తూ కూంబింగ్‌లో నిర్వహిస్తోన్నారు. తెలంగాణలోని ములుగు, భద్రాద్రి జిల్లాలకు చెందిన పోలీసు యంత్రాంగం, అధికారులు అప్రమత్తమై ఎప్పటికప్పుడు కర్రెగుట్టల్లో జరుగుతున్న సమాచారాన్ని తీసుకుంటు మావోయిస్టుల కదలికలను పసికడుతున్నారు. ఇప్పటికే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములుగు, వరంగల్ జిల్లాలో ఉన్న మావోయిస్టుల సానుభూతి పరులు మిలీషియా సభ్యులు కిందిస్థాయి క్యాడర్ సైతం అటు వరంగల్, ఇటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పోలీసుల ఎదుట లొంగి పోతున్నారు. ఇటీవల కాలంలో పెద్ద ఎత్తున మావోయిస్టులు లొంగిపోయారు. సుమారు 250 మందికి పైగా ఇటీవల కాలంలో పోలీసుల ఎదుట వివిధ ప్రాంతాలు వివిధ రాష్ట్రాలకు చెందిన మావోయిస్టులు లొంగిపోయారు. వారికి ప్రభుత్వం తరఫున అందచేసే ఆర్థిక సహాయాన్ని సైతం పోలీసులు అందచేస్తున్నారు. మొత్తం మీద జిల్లా సరిహద్దు ప్రాంతంలో కట్టుదిట్టమైన భద్రత బలగాలను ఏర్పాటు చేశారు. వాహనదారులు, కొత్తగా ఆ ప్రాంతం నుంచి వచ్చే వారిని, అనుమానం వచ్చిన వారిని పూర్తిస్థాయిలో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. కర్రెగుట్టల ఎన్‌కౌంటర్‌తో జిల్లాకు సంబంధించిన పోలీసు యంత్రాంగం అప్రమత్తమైందని చెప్పవచ్చు.

నిజాయితీ చాటుకున్న యువకుడు

దొరికిన రూ.50వేలను అందజేసిన సుదీప్

లక్ష్మిదేవిపల్లి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): తనకు దొరికిన రూ.50వేలను ఆచూకీ తెలుసుకుని తిరిగి అందజేసి నిజాయతీ చాటుకున్నాడు ఓ యువకుడు. బుధవారం కొత్తగూడెం యాక్సిస్‌బ్యాంక్ ఏటీఎం సమీపంలో రామవరానికి చెందిన సింగరేణి ఉద్యోగి టంగుటూరి సుదీప్‌కు రూ.50వేలు దొరికాయి. ఈ విషయం తన తోటి బంధుమిత్రులకు తెలియచేసి వాట్సాప్ గ్రూపులో సమాచారం పెట్టి డబ్బును పోగొట్టుకున్న వ్యక్తులు తమను సంప్రదించాల్సిందింగా వివరాలు తెలిపారు. ఈ సమాచారం అందుకున్న బాధితుడు పెనగడపకు చెందిన కే.శంకర్ గురువారం సుదీప్‌ను సంప్రదించాడు. వివరాలు సేకరించి యక్సిస్ బ్యాంకు సిబ్బంది సమక్షంలో సుదీప్ తనకు దొరికిన రూ.50వేలను శంకర్‌కు అందచేసి ఔదర్యాన్ని చాటుకున్నాడు. సుదీప్‌ను మిత్రులు కృష్ణయ్య, నర్సయ్య, ప్రసాద్, బ్యాంకు సిబ్బంది అభినందించారు.

రొంపేడులో కార్డెన్‌సెర్చ్



ఇల్లెందురూరల్, ఏప్రిల్24 (ఆంధ్రజ్యోతి): ఇల్లెందు మండలం చర్చి రొంపేడు గ్రామంలో గురువారం ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఇంటిని తిరుగుతూ తనిఖీలు చేపట్టారు. ఈ కార్డెన్‌సెర్చ్‌లో పలు ఇళ్లల్లో తనిఖీలు చేయగా పత్రాలు సరిగ్గాలేని ద్విచక్ర వాహనాలు, ఆటోలను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం డీఎస్పీ గ్రామస్థులతో మాట్లాడారు. గ్రామంలో ఎటువంటి అనుమానిత వ్యక్తులు సంచరించిన పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాలకు బానిసల కావద్దని, గుడుంబాకు దూరంగా ఉండాలని కోరారు. ప్రతి వాహనానికి పత్రాలు సక్రమంగా ఉండాలని వివరించారు. కార్డన్‌సెర్చ్‌లో ఇల్లెందు సీఐ సత్యనారాయణ, ఎస్‌లు సూర్య పాల్గొన్నారు.

ఇరువర్గాల ఘర్షణ: ముగ్గురికి గాయాలు

అశ్వారావుపేటరూరల్, ఏప్రిల్24 (ఆంధ్రజ్యోతి): ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ముగ్గురికి గాయాలు అయ్యాయి. ఏఎస్ఐ యాకుబ్ ఆలీ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఆనుపాక గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు అయిన చారుగళ్ల లక్ష్మయ్య, పుల్లమ్మకు కుమారుడు రాంబాబు, వికలాంగురాలైన కుమార్తె ఉన్నారు. అదే గ్రామానికి చెందిన నరేశ్ అనే వ్యక్తి తమ కుమార్తెతో చనువుగా ఉండటంతో పలు మార్లు వాగ్వాదాలు జరిగాయి. ఇదే తరుణంలో గురువారం సాయంత్రం కూడా మరోసారి వాగ్వాదం జరిగింది. విషయం తెలుసుకున్న నరేశ్ బంధువులు మంగరాజు, మల్లేశ్వరరావు లక్ష్మయ్య ఇంటికి వెళ్లి గొడవ పడ్డారు. ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరగటంతో లక్ష్మయ్య, పుల్లయ్య, మల్లేశ్వరరావుకు గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను అశ్వారావుపేట ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఘటనపై ఇరువర్గాలు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

భగ్గుమంటున్న భానుడు

(3వ పేజీ తరువాయి)

ఉక్కపోతతో తల్లడిల్లుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం 7 గంటల వరకు ఎండ తీవ్రత అధికంగా ఉంటోందని పలువురు వాపోతున్నారు. జిల్లా కేంద్రమైన కొత్తగూడెం పట్టణానికి గ్రామీణ ప్రాంతాల నుంచి అత్యవసర పనుల కోసం ప్రజలు వస్తుంటారు. ఎండ తీవ్రత వల్ల పనులన్నీ వాయిదా వేసుకుని సాయంత్రం సమయంలోనే బయటకు వస్తున్న పరిస్థితులున్నాయి. పట్టణంలో మధ్యాహ్నం ప్రధాన రహదారులన్నీ జనం లేక వెలవెల పోతున్నాయి. ఎండ తీవ్రత కారణంగా శీతల పానియాల వైపు ప్రజలు మొగ్గు చూపుతుండటంతో వాటి ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. సింగరేణి ఓపెన్‌కాస్టుల కారణంగా, అలాగే సింగరేణి ప్రాంతాల్లో అడవులను తొలగించడం వల్ల వాతావరణంలో సమతుల్యం లోపించి ఎండ తీవ్రత అధికమవుతుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సింగరేణి ఓపెన్‌కాస్టు, మైన్స్ డిపార్టుమెంట్స్ ప్రాంతాల్లో ఎండ తీవ్రత అధికంగా ఉంటున్న దృష్ట్యా కార్మిక పని వేళల్లో మార్పులు చేయాలని కార్మిక సంఘాల నాయకులు కోరుతున్నారు. ప్రధానంగా కొత్తగూడెం ఏరియాలోని జేవీఆర్ ఓపెన్‌కాస్ట్, కిష్టారం ఓపెన్‌కాస్టుల్లో కార్మికులు విధులు నిర్వహించే ప్రదేశాల్లో ఎండతీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు చలువ పందిళ్లు, చల్లటి మంచినీరు, మజ్జిక ప్యాకెట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని కార్మికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికే కొన్ని పని ప్రదేశాల్లో కార్మికుల సమయపాలనలో మార్పుచేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.

ఏప్రిల్, మే నెలలో ఎండ తీవ్రత అధికంగా ఉండే అవకావం ఉన్నందున ప్రత్యామ్నాయ మార్గాలను చూపాలని కార్మికులు వేడుకుంటున్నారు. ఇల్లెందు, మణుగూరు ఓపెన్‌కాస్టుల్లో సైతం రక్షణ చర్యలను తీసుకోవాలని కోరుతున్నారు. పారిశ్రామిక ప్రాంతమైన కొత్తగూడెం, పాల్వంచలో అధిక ఉష్ణోగ్రత నమోదు అవుతున్న నేపథ్యంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లను సైతం ప్రధాన కూడళ్లలో అందుబాటులో ఉండేవిధంగా సింగరేణి, కేటీపీఎస్, నవభారత్ తదితర పరిశ్రమల యాజమాన్యాలు చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



నిర్మానుష్యంగా మారిన కొత్తగూడెంలోని ప్రధాన రహదారి



గొడుగులు వేసుకున్న చిరువ్యాపారులు

సరిహద్దులో ఎక్సైజ్ అధికారుల తనిఖీలు

అశ్వారావుపేటరూరల్, ఏప్రిల్24 (ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేటలో గల అంతరాష్ట్ర సరిహద్దు వద్ద గురువారం సాయంత్రం ఎక్సైజ్ అధికారులు తనిఖీ చేపట్టారు. వాహనాలను తనిఖీ చేశారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల రవాణా నివారణలో భాగంగా తనిఖీలు చేశారు. స్థానిక బస్టాండ్‌లోనూ తనిఖీ చేపట్టారు. సాధారణ తనిఖీల్లో భాగంగానే వాహనాల తనిఖీలు చేపట్టామని ఆబ్కారీ ఎస్ఐ రాజేశ్వరరావు తెలిపారు. తనిఖీల్లో సిబ్బంది పాల్గొన్నారు.



ఉగ్రదాడి.. పాకిస్థాన్ కుట్ర

(3వ పేజీ తరువాయి)

ఇప్పుడు విచ్ఛిన్నం చేసిందన్నారు. పాకిస్థాన్‌లో టీ తాగేందుకు ఛాయ్‌పత్తా లేదని, అక్కడ ధరలన్నీ ఎక్కువేనని, ఇలాంటి పరిస్థితుల్లో ప్రపంచదేశాల దృష్టిని తనవైపు తిప్పుకునేందుకు రాక్షసత్వాన్ని చూపించిందన్నారు. హిందువులను మాత్రమే గుర్తించి గన్‌షాయింట్ చేసి చంపడం జరిగిందని, ఇది అతిక్రూరమైన చర్య అని, యుద్ధం జరిగితే సైన్యం మాత్రమే పోరాడుతుందని, నీటిమధ్య తగాదాను ఇరురాష్ట్రాలు, దేశాలు మాట్లాడుకుంటాయని అన్నారు. జమ్మూకాశ్మీర్‌లో హత్యాకాండకు నిరసనగా ఈనెల 26న దేశవ్యాప్త బంద్‌కు బీజేపీ పిలుపునిచ్చిందన్నారు. దేశంలో కేవలం7 జిల్లాల్లోనే నక్సలిజం ఉందని, ఆ పేరు లేకుండా చేసేందుకు బీజేపీ పనిచేస్తోందన్నారు. అణగారిన వర్గాలకు న్యాయం చేయని కాంగ్రెస్ ప్రభుత్వానికి మౌళీలంటే ఇష్టమని, కేవలం ఓటుబ్యాంక్ కోసం పాలన సాగిస్తున్నదని, 57ఏళ్లపాటు దేశాన్ని పరిపాలించిన కాంగ్రెస్‌కు ఇది తగదన్నారు. దేశవ్యాప్తంగా ఎన్నో ఏళ్లుగా కొంతమంది ఆధీనంలో ఉన్న భూములతో ఎవరికీ న్యాయం జరగడం లేదని, అందుకే వక్ఫ్‌బోర్డు చట్టం పేదవారికోసమే బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. గ్రామపంచాయితీ కార్యాలయాలలో పంట నష్టం వివరాలను తెలియజేయాల్సి ఉందని, అధికభాగం నష్టం దక్షిణ తెలంగాణాలోనే జరిగిందని, మామిడికి ఎకరానికి రూ.30వేలు, వరికి రూ.20వేలు నష్టపరిహారం ప్రభుత్వం చెల్లించాలని, ఉచితంగా నాణ్యమైన విత్తనాలను రైతులకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ ఖమ్మం పార్లమెంటరీ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు, నియోజకవర్గ కన్వీనర్ భాస్కర్ల వీరంరాజు, నాయకులు పాలకొల్లు శ్రీను, శివ, నున్నా రవి, సుదర్శన్ మిశ్రా, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సాకారం కానున్న సాగునీటి స్వప్నం

(3వ పేజీ తరువాయి)

లభించాయని తెలిపారు. సీతమ్మసాగర్ బహుళార్థక ప్రాజెక్టు ద్వారా 282.80 మెగావాట్ల జలవిద్యుత్‌కు సెంట్రల్ వాటర్ కమిషన్ అనుమతులు ఇవ్వడం జరిగిందని మంత్రి తుమ్మల తెలిపారు. సీడబ్ల్యూసీ సాంకేతిక సలహా కమిటీ అనుమతుల కోసం కేంద్ర జలశక్తి సెక్రటరీ దేబశ్రీముఖర్జి ఆధ్వర్యంలో టెక్నికల్ అడ్వైజరీ కమిటీ 157వ సమావేశంలో చర్చించడం జరిగిందని మంత్రి తుమ్మల తెలిపారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులో 104 కిలోమీటర్లు ప్రధాన కాలువ నిర్మాణం పూర్తయ్యిందని సత్తుపల్లి ట్రాంక్ పాలేరు లింక్ కెనాల్ 60కిలోమీటర్లు వరకు పనులు పూర్తి చేశామన్నారు. మిగిలిన 125 కిలోమీటర్ల కాలువ పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. 8 డిస్ట్రిబ్యూటరీ ప్యాకేజీ పనులకు టెండర్లు పూర్తి చేసినట్లు భూసేకరణ సర్వే పురోగతిలో ఉందని తెలిపారు. కేంద్ర జలసంఘం డీపీఆర్ అనుమతి రావడం ద్వారా ఈ ప్రాజెక్టు పనులు పరుగులు పెట్టించి సత్వర నిర్మాణం పూర్తిచేసి సాగునీరు, తాగునీటితో పాటు జలవిద్యుత్ కూడా ఉత్పత్తి చేయనున్నట్టు మంత్రి తుమ్మల తెలిపారు.

ఉమ్మడి జిల్లాను సస్యశ్యామలం చేస్తాం

(3వ పేజీ తరువాయి)

అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలని కోరారు. ఖమ్మంలో అండర్‌గ్రౌండ్‌డ్రెయినేజీ మిగిలిన పనులకు కూడా మంజూరుకు ప్రయతిస్తున్నానని పేర్కొన్నారు ఖమ్మం రాష్ట్రానికి పార్టీలోను అభివృద్ధిలోను మోడల్‌గా ఉండాలన్నదే నాసంకల్పనమని గతంలో కూడా ఖమ్మంజిల్లాలో అభివృద్ధిలో మోడల్‌గానిలిచిందని గుర్తుచేశారు. ఈసమావేశంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు,జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమాజోహార, మార్కెట్ కమిటీచైర్మన్ యరగర్ల హనుమంతరావు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ కార్పొరేటర్లు కమర్తపు మురళి, మాజీ కార్పొరేటర్ బాలగంగాధర్ తిలక్, దొబ్బల సౌజన్య, ఖాదర్, దీప్లా, సాధురమేష్‌రెడ్డి, పుచ్చకాయల వీరభద్రం, కొత్త సీతారాములు, తదితరులు పాల్గొన్నారు.

నేడు వైరా కాల్వల ఆధునీకరణ

(3వ పేజీ తరువాయి)

ఆయకట్టులో పంటల సాగుకు రైతులు విరామం ప్రకటించారు. అయితే పనులు ప్రారంభించే విషయంలో ఇప్పటికే తీవ్ర ఆలస్యమైంది. ఏప్రిల్ నెల చివరికొచ్చింది. మే అలాగే జూన్‌లో మొదటి రెండువారాలు మాత్రమే పనులు చేసేందుకు సమయం ఉంది. ఆ తర్వాత ఈ రెండు కాల్వల ఆయకట్టు రైతులు ఖరీఫ్ వ్యవసాయం చేపట్టాల్సి ఉంది. దీంతో ఎట్టకేలకు శుక్రవారం తాటిపూడి గ్రామానికి సమీపంలో కుడి కాల్వ వద్ద ఎమ్మెల్యే రాందాస్ నాయక్ భూమిపూజ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ప్రదేశాన్ని గురువారం నీటిపారుదలశాఖ వైరా డీఈ పి.శ్రీనివాస్, వైరా, కొణిజర్ల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, వడ్డె నారాయణ పరిశీలించారు.

వెలవెలబోయిన చేపల వేట



వైరాఏప్రిల్24(ఆంధ్రజ్యోతి): వైరా రిజర్వాయర్‌లో చేపలవేట వెలవెలబోయింది. దాదాపు 1100మంది మత్స్యకారులకు తీవ్ర నిరాశే మిగిలింది. రిజర్వాయర్‌లో మత్స్యసంపద లేకపోవడంతో ఈ మత్స్యకారులకు కన్నీళ్ల పర్యంతం ఒక్కటే తక్కువ. గురువారం తెల్లవారుజామున వందలాదిమంది మత్స్యకారులు రిజర్వాయర్‌లో చేపల వేటకు దిగారు. కేవలం ఐదు టన్నుల చేపలు కూడా లభించలేదు. వైరా మత్స్య పారిశ్రామిక సహకార సంఘంలో దాదాపు 1140మంది సభ్యులుగా ఉన్నారు. గత ఏడాది రాష్ట్ర ప్రభుత్వం ఉచిత చేపపిల్లలను వైరా రిజర్వాయర్‌కు సరఫరా చేసింది. అయితే గత జూలై ఒకటి నుంచి చేపల వేట నిలిపివేయాల్సి ఉన్నప్పటికీ మితిమీరిన రాజకీయ జోక్యంతో డిసెంబరు చివరి వరకు చేపల వేట కొనసాగించారు. కిలో ఒక్కింటికి రూ.75చొప్పున రేటు చెల్లించేందుకు ముందుకొచ్చారు.అందుకు గానూ దాదాపు 65టన్నుల చేపలు దిగుబడి వస్తుందనే అంచనాతో లారీలు, వ్యాన్లు, ఐస్‌బాక్సులను రిజర్వాయర్ చుట్టూ ఏర్పాటుచేశారు. తీరా ఐదుటన్నుల చేపలు కూడా లభించలేదు.

క్రైం సమాచారం

వడదెబ్బతో ఇద్దరి మృతి

సత్తుపల్లిరూరల్/ పెనుబల్లి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): వడదెబ్బ కారణంగా ఖమ్మం జిల్లాలో గురువారం ఇద్దరు మృతిచెందారు. సత్తుపల్లి మండలం గాంధీనగరం గ్రామానికి చెందిన తాటి లక్ష్మడు(60) సమీపంలోని మామిడి తోటకు బుధవారం కాపల కాసేందుకు వెళ్లగా స్పృహతప్పి పడిపోయాడు. గమనించిన స్థానికులు సత్తుపల్లిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు. కాగా ఈ విషయమై అధికారులు ధ్రువీకరించాల్సి ఉంది. పెనుబల్లి మండలంలోని కొత్తకారాయిగూడెం గ్రామానికి చెందిన నెల్లూరి బోధనాచారి(37) పని నిమిత్తం మండల కేంద్రానికి వడదెబ్బకు గురయ్యాడు. కింద పడిపోగా స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించారు. 108సిబ్బంది పెనుబల్లి ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, పిల్లలున్నారు.

గంజాయి పట్టివేత, ఇద్దరి అరెస్టు

భద్రాచలం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా-ఒడిసా సరిహద్దు అటవీ ప్రాంతం నుంచి భద్రాచలం మీదుగా తరలిస్తున్న ఏడు కిలోల గంజాయిని గురువారం జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్సు అధికారులు భద్రాచలంలో పట్టుకున్నారు. రవాణా చేస్తున్న వాహనంతో పాటు ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.3.5 లక్షలుగా ఉంటుందని వారు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్‌ఐ గౌతమ్, సిబ్బంది హబీబ్ పాషా, వెంకటనారాయణ, గురవయ్య, శ్రావణి, పార్థసారధి, రమేష్ పాల్గొన్నారు.

గోవులను తరలిస్తున్న వ్యాన్ల పట్టివేత

తల్లాడ, ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి): అక్రమంగా గోవులను తరలిస్తున్న రెండు వ్యాన్లను గురువారం తల్లాడలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. ఏపీ లోని విజయనగరం జిల్లా మానాపురం నుంచి హైదరాబాదుకు రెండు వ్యాన్లలో అక్రమంగా 120గోవులను తరలిస్తుండగా తల్లాడలో ఎస్‌ఐ బి.కొండలరావు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది పట్టుకున్నారు. రెండు వ్యాన్లలో గోవులను అక్రమంగా తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. వ్యాన్లను స్వాధీనం చేసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. గోవులను పాల్వంచలోని గోశాలకు తరలించారు. వ్యాన్ల డ్రైవర్లు కొల్లి నాగరాజు, బుద్దాల దుర్గాప్రసాద్, వ్యాన్ల యజమానులు జాలారాజు, శేఖర్‌గౌడ్, వ్యాపారులు రఫీ, నాయుడులపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

నేలకొండపల్లి, ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి): ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం నేలకొండపల్లిలో జరిగింది. నేలకొండపల్లికి చెందిన కూరాకుల చిన్న వెంకన్న (50)ఎప్పటిలాగానే గురువారం ఉదయం మేకలను తోలుకుని మేపటానికి వెళ్లాడు. సాయంత్రమైనా ఇంటికి రాలేదు. మేకలు మాత్రం ఇంటికి వచ్చాయి. దీంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు వెంకన్న కోసం వెతుకుతుండగా, వైద్యనాథస్వామి దేవాలయం పక్కనే ఉన్న వాగు వద్ద ఓచెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వటంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని కిందకు దించి, పోస్టుమార్టం కోసం నేలకొండపల్లికి సీహెచ్‌సీకి తరలించారు. మృతునికి ఇద్దరు కుమారులున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

అప్పులు తీర్చలేక యువకుడు..

ఖమ్మం రూరల్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): క్రెడిట్ కార్డు అప్పులు తీర్చలేక ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఏదులాపురం మునిసిపాలిటి పరిధిలోని నాయుడుపేటలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలాయపాలెం మండలం, రాజారం గ్రామానికి చెందిన మెట్టు కర్ణాకర్ (29) డిగ్రీ పూర్తిచేశాడు. ఖమ్మంలోని రోటరీ నగర్‌లో నివాసం ఉంటు ప్రయివేట్ ఉద్యోగం చేస్తున్నాడు. కర్ణాకర్ క్రెడిట్ కార్డుద్వారా కొంత అప్పులు చేశాడు. క్రెడిట్ కార్డు అప్పులు తీర్చలేక కర్ణాకర్ నాయుడుపేటలో ఉంటున్న తన సోదరి రజిత ఇంటికి బుధవారం రాత్రి వెళ్లాడు. అర్ధ రాత్రి సమయంలో డాబాపైన ఉన్న స్లాబు రాడ్డుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అన్నం సేవా ఫౌండేషన్ వారి సహాయంతో కర్ణాకర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుఇ కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పురుగుల మందు తాగి రైతు..


భద్రు(ఫైల్)

కారేపల్లి, ఏప్రిల్24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దుబ్బతండాకు చెందిన రైతు లావుడ్యి భద్రు(52)అనే రైతు గురువారం తన పంట చేనువద్ద పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. భద్రు రెండు ఎకరాల మిర్చి, రెండుఎకరాల్లో పత్తి పంటసాగు చేశాడు. పంటఅనుకున్నంత దిగుబడిరాలేదని తెలిపారు. ఇంట్లో పరిస్థితులు సరిగాలేకపోవడంతో మండల కేంద్రంలోని ఓ పురుగులషాపులో గుమస్తాగా పనిచేస్తున్న భద్రు గురువారం అప్పులు తీరే మార్గంలేకపోవడంతో పంటచేను వద్దనే పురుగుల మందు తాగి ఇంటివద్దనే ఉన్న భార్యకు ఫోన్‌చేశాడు. ఈవిషయాన్ని భద్రు భార్య ఇంటిపక్కలవారికి తెలిపి తోటవద్దకు వెళ్లి భద్రును ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతు మృతిచెందాడు. భద్రు కుమారుడి ఫిర్యాదుపై ఏఎస్‌ఐ నాగరాజకుమారి కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేపట్టారు. భద్రుకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

ప్రమాదవశాత్తు రైతు ..

తిరుమలాయపాలెం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని పిండిప్రోలు గ్రామంలో గురువారం సాయంత్రం ఓరైతు ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదానికి గురై మృతిచెందాడు. గ్రామానికి చెందిన కిలారు వెంకన్న(60) వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. ఈఏడాది రబీలో తన పొలంలో మొక్కజొన్న సాగుచేశాడు. మొక్కజొన్న పంటకు కొయ్యలు తొలిగించేందుకు మంటలు పెట్టాడు. ఈక్రమంలో పక్కనే ఉన్న మరో రైతుకు చెందిన మొక్కజొన్న చేనుకు మంటలు వ్యాపిచాయి. మంటలు ఆర్పేందుకుగాను వెంకన్న ప్రయత్నిస్తుండగా మంటలు అంటుకుని మృతిచెందాడు. మృతునికి భార్య మూడునెలల క్రితం మృతిచెందగా ముగ్గురు కుమార్తెలున్నారు.

గుండెపోటుతో ఎన్డీనేత మృతి

తిరుమలాయపాలెం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని పిండిప్రోలు గ్రామానికి చెందిన సీపీఐఎంఎల్ మాస్‌లైన్ మండల నాయకులు రావూరి సురేందర్(57) గురువారం గుండెపోటుతో మృతిచెందారు. ఆయన కొంతకాలంగా గుండెసమస్యతో బాధపడుతున్నారు. గురువారం గుండెపోటురావడంతో ఇంటివద్ద మృతిచెందారు. ఆయన మృతదేహాన్ని సీపీఎంజిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డివిజన్ కార్యదర్శి బండి రమేష్, మాస్‌లైన్ నాయకులు కె.నాగేశ్వరరావు ,నవీన్ , వెంకటస్వామి, కాంగ్రెస్ నాయకులు ఉన్నం రమేష్ సందర్శించారు.

గుర్తుతెలియని యువకుడు..

రఘునాథపాలెం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని యువకుడు రహదారి పక్కన ఉన్న విగ్రహం వద్ద పడుకొని అలానే మృతి చెందిన సంఘటన రఘునాథపాలెం మండలం వీ వెంకటాయపాలెంలో వెలుగులోకి వచ్చింది. ఏఎస్‌ఐ శ్రీను తెలిపిన వివరాల మేరకు.. వీ వెంకటాయపాలెం గ్రామంలోని ప్రధాన రహదారి వెంట ఉన్న వైఎ్‌సఆర్ విగ్రహం వద్ద 30ఏళ్ల వ్యక్తి మృతదేహాన్ని గ్రామపంచాయతీ అధికారులు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వటంతో ఏఎ్‌సఐ శ్రీను సంఘటన ప్రాంతానికి చేరుకొని ప్రాథమికంగా విచారణ చేపట్టారు. రహదారి వెంట నడిచే వెళ్లే వ్యక్తి కాళ్లకు బొబ్బలు వచ్చి వడదెబ్బతో మృతిచెందినట్లు పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని అన్నం ఫౌండేషన్‌కు అప్పగించారు.



మలేరియా మహమ్మారిపై మన్యం పైచేయి

- ఏజెన్సీలో కేసుల తగ్గుముఖం
- భారీగా తగ్గిన స్ప్రేయింగ్ గ్రామాలు
- రేపటి నుంచి గొత్తికోయ గ్రామాల్లో వైద్య పరీక్షలు
- ఈ ఏడాది ఇప్పటి వరకు 23 పాజిటివ్ కేసులు
- నేడు ప్రపంచ మలేరియా వ్యతిరేక దినోత్సవం

భద్రాచలం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): భద్రాచలం ఏజెన్సీని గడగడలాడించిన మలేరియా కేసులు ఆరేళ్లుగా తగ్గుముఖం పట్టాయి. మలేరియా అధికంగా ఉండే ప్రాంతాలు ఆంధ్రాకు వెళ్లడంతో పాటు జిల్లా వైద్యఆరోగ్యశాఖ, మలేరియా విభాగం అధికారులు చేపట్టిన చర్యలతో మలేరియా కేసులు ఇటీవల కాలంలో గణనీయంగా తగ్గాయని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. రాష్ట్రస్థాయిలో మలేరియా ప్రభావిత జిల్లాల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అత్యంత కీలకంగా ఉండటంతో అప్రమత్తంగానే ఉన్నట్లు వైద్య వర్గాలు తెలిపాయి. సరిహద్దున ఉన్న ఛత్తీస్‌గఢ్, ఆంధ్ర నుంచి వస్తున్న సైలెంట్ క్యారియర్ల (లక్షణాలు లేని మలేరియా కేసులు) ద్వారా కేసులు నమోదవుతున్నాయని వైద్యాధికారులు అంటున్నారు. మలేరియా కేసులను గుర్తించేందుకు అధికారులు ఈ నెల 26వ తేదీ నుంచి గొత్తికోయ గ్రామాల్లో సర్వే చేపట్టనున్నారు. ప్రపంచ మలేరియా వ్యతిరేక దినోత్సవం శుక్రవారం నిర్వహించనున్న తరుణంలో ప్రత్యేక కథనం..

భారీగా తగ్గిన స్ప్రేయింగ్ గ్రామాలు

జిల్లాలో మలేరియా పాజిటివ్ కేసులు తిరోగమనంలో ఉండటంతో సింథటిక్ పైరిత్రాయిడ్ స్రేయింగ్ చేసే గ్రామాలు గత ఆరేళ్ల



గా క్రమేపి తగ్గుతున్నాయి. గతంలో 400 గ్రామాల్లో స్ప్రేయింగ్ నిర్వహించగా ఆరేళ్ల క్రితం 297 గ్రామాల్లో స్ప్రేయింగ్ నిర్వహించే పరిస్థితులు ఉండేవి. గత ఏడాది 197 గ్రామాల్లో మలేరియా స్ప్రేయింగ్‌ను నిర్వహించగా ఈ ఏడాది 95 గ్రామాలకే స్ప్రేయింగ్ చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. ఈ స్ప్రేయింగ్ జూన్‌లో తొలి విడత, ఆగస్టులో రెండో విడతగా నిర్వహించనున్నారు. జూన్ ఒకటి నుంచి డిసెంబరు వరకు ప్రతి నెల ఏడో తేదీ నుంచి 17వ తేదీ వరకు ర్యాపిడ్ ఫీవర్ సర్వేను జిల్లాలో చేపట్టనున్నారు. సింథటిక్ పైరిత్రాయిడ్ స్ప్రేయింగ్‌ను జూన్ 15 నుంచి చేపట్టేందుకు ఇప్పటికే కార్యాచరణ రూపొందించారు. 45 రోజుల వ్యవధిలో రెండు దపాలుగా స్ప్రేయింగ్ చేపట్టనుండగా ఇందు కోసం రూ.15 లక్షలను స్ప్రేయింగ్ చేసిన సిబ్బందికి వేతనాలుగా చెల్లించనున్నారు.

26 నుంచి 140 గొత్తికోయ గ్రామాల్లో సర్వే

ఛత్తీస్‌గఢ, ఆంధ్రా, ఒడిసా నుంచి వచ్చే సైలెంట్ క్యారియర్స్‌తో మలేరియా కేసులు తెలంగాణ ప్రాంతంలో ప్రబలే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని 27 పీహెచ్‌సీల పరిధిలోని 198 గ్రామాల్లో 32,918 మందికి సర్వే నిర్వహించి పరీక్షలు చేయనున్నారు. ఇందులో 140 గొత్తికోయ గ్రామాల్లో లక్షణాలు లేని మలేరియా కేసులను గుర్తించనున్నారు. 58 హైరిస్కు గ్రామాల్లో ఈ సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. 13 పీహెచ్‌సీల పరిధిలోని 95 గ్రామాల్లో 48 వేల జనాభా ఉండగా అక్కడ సింథటిక్ పైరిత్రాయిడ్ స్రేయింగ్‌ను జూన్, ఆగస్టుల్లో నిర్వహించనున్నారు. 2021వ సంవత్సరం నుంచి జిల్లాకు దోమ తెరల సరఫరా లేదు. స్థానిక అధికారులు ప్రతిపాదనలు పంపుతున్నా రావడం లేదు.

సిబ్బంది కొరత...

మలేరియా ప్రభావిత జిల్లాల్లో ఎంతో కీలకమైన భద్రాద్రి జిల్లాలో మలేరియా ప్రోగ్రామింగ్ అధికారి రెగ్యులరు పోస్టు లేకపోవడంతో ఇన్‌చార్జే బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అసిస్టెంట్ మలేరియా అధికారి పోస్టు ఒకటి దీర్ఘకాలంగా ఖాళీగా ఉండగా ఇన్‌చార్జే బాధ్యతలు నిర్వహిస్తున్నారు. రెండు ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆర్‌డీటీ కిట్లు 50 వేలు, రక్తపూత పరీక్షలు నిర్వహించేందుకు 70 వేల స్లైడ్‌లు, ల్యాండ్‌సెట్ పరీక్షలు నిర్వహించేందుకు 40 వేల సామగ్రి అందుబాటులో ఉన్నాయి. మలేరియా పాజిటివ్ రోగులకు అందించే ఏసీటీ మందుల కిట్ వెయ్యి ఉన్నాయి.

సంవత్సరం	స్ప్రేయింగ్ గ్రామాలు	కేసులు
2020	444	364
2021	297	355
2022	297	256
2023	249	182
2024	197	095
2025	095	023

గత ఐదేళ్లలో మలేరియా స్ప్రేయింగ్ గ్రామాలు, మలేరియా కేసుల వివరాలు

రోడ్డు ప్రమాదంలో ఆర్‌ఎంపీ మృతి



ఆళ్లపల్లి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ ఆర్‌ఎంపీ మృతి చెందిన సంఘటన గురువారం ఆళ్లపల్లి మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. సుజాతనగర్ మండలం, రాఘవాపూరం గ్రామానికి చెందిన కళ్లెం సాయిచరణ్(30) ఏడాది క్రితం ఆళ్లపల్లి మండలం, అనంతోగు గ్రామంలో ఆర్‌ఎంపీగా ఇక్కడి ప్రాంతంలో వైద్యం చేస్తు జీవిస్తున్నాడు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి అనంతోగు పంచాయతీ, జిన్నెలగూడెం గ్రామంలో స్నేహితుల వివాహ కార్యక్రమానికి బైక్‌పై వెళ్లి తిరిగి గురువారం తెల్లవారుజామున వస్తున్న క్రమంలో జిన్నెగూడెం సమీపంలో ఓ మూలమలుపు వద్ద బైక్ అదుపుతప్పి గోతిలో పడిపోయాడు. దీంతో సాయి తలకు తీవ్రమైన గాయాలతో స్పృహ కోల్పోయాడు, గమనించిన స్నేహితులు క్షతగాత్రున్ని హుటాహుటిన కొత్తగూడెం తీసుకెళ్లగా, అక్కడి వైద్యులు పరిక్షించి పరిస్థితి విషమంగా ఉందని వరంగల్ ఎంజీఎంకు రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతు మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలకు ఉన్నారు.

రూ.12లక్షల బంగారు ఆభరణాల చోరీ

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాకర్లపల్లి రోడ్డులోని ఓ ఇంట్లో సుమారు రూ.12లక్షల విలువైన సొత్తు అపహరణకు గురైన సంఘటన గురువారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బాధితురాలు నరుకుళ్ల నీలావతి స్నానం చేసేందుకు వెళ్లినప్పుడు మెడలోని 4కాసుల ముత్యాల పగడాల గొలుసు, 10కాసుల బంగారు గాజులు తీసి పర్సులో పెట్టి సొరుగులో దాచింది. అనంతరం వచ్చి చూడగా రూ.12లక్షల విలువైన 14కాసుల బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయని గమనించారు. ఈ మేరకు లీలావతి అల్లుడు మేడా కాంతారావు సత్తుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బీజేపీ మండల అధ్యక్షుడిపై దాడి

బూర్గంపాడు, ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మోరంపల్లి బంజరు గ్రామానికి చెందిన బీజేపీ మండల అధ్యక్షుడు బీరకసాయిశ్రీను తోపాటు మరోవ్యక్తి పై దాడికి పాల్పడిన ఘటనలో గురువారం బూర్గంపాడు పోలీస్‌స్టేషన్‌లో ఏడుగురువ్యక్తులపై కేసునమోదయ్యింది. మండల పరిధిలోని జింకలగూడెం గ్రామంనుంచి అక్రమంగా పశువులను తరలిస్తున్నారనే సమాచారంతో సాయిశ్రీను, వెంకట్రామిరెడ్డి ద్విచక్రవాహనంపై అక్కడకు చేరుకున్నారు. ఈసందర్భంగా పశువుల అక్రమరవాణాను అడ్డుకున్నారు. దీంతో గ్రామానికి చెందిన ఎస్కే.లక్కు, ఇస్మాయిల్, నాగుల్మీరా, చాంద్‌బీ, హుస్సేన్, నాగుల్మోరా, మోహిస్‌అనే వ్యక్తులు దాడిచేశారు. సాయిశ్రీను తల్లి వెంకటరమణ ఫిర్యాదు మేరకు ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాజేష్ తెలిపారు.

కుక్కల దాడిలో 12 గొర్రెల మృత్యువాత

చంద్రుగొండ, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): వీధికుక్కల దాడిలో 12 గొర్రెలు మృత్యువాత పడిన ఘటన మండలంలోని రావికంపాడు గ్రామంలో చోటు చేసుకుంది. బాధిత రైతు ఆనంగి పకీర్ తెలిపిన వివరాల ప్రకారం బుధవారం అర్ధరాత్రి గొర్రెల దొడ్డిపై వీధికుక్కలు దాడి చేసి గొర్రెలను గాయపరిచాయి. తీవ్రగాలపాలైయిన 12 గొర్రెలు మృతి చెందాయి. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని రైతు కోరుతున్నాడు.

రోడ్ల నిర్మాణాలు పూర్తి చేయండి

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు


అధికారులతో మాట్లాడుతున్న మంత్రి

దమ్మపేట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): దమ్మపేట, అశ్వారావుపేట మండలాల పరిధిదిలోని రహదారులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్ అండ్‌బీ డీఈలు రవిచంద్ర ప్రకాష్, జే. విశ్వనాథ్‌లను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ఇటీవల అశ్వారావుపేట, ములకలపల్లి డీఈలుగా బాధ్యతలు చేపట్టిన అధికారులు గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో మంత్రి తుమ్మలను మర్యాదపూర్వకంగా గురువారం కలిశారు. ఈసందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ దమ్మపేట మండలంలోని పూసుకుంట రహదారి, అశ్వారావుపేటలోని ప్రధాన రహదారి, డివైడర్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అశ్వారావుపేట పట్టణంలో నిర్మిస్తున్న రహదారి వంకరలు లేకుండా, నాణ్యత ప్రమాణాలతో నిర్మించాలన్నారు. మంత్రిని కలిసిన వారిలో దమ్మపేట సొసైటీ చైర్మన్ ఎల్లిన రాఘవరావు, కొయ్యల అచ్యుతరావు, కాసాని నాగప్రసాదు, ఎర్రా వసంతరావు, మన్నెం అప్పారావు, ఎర్రగొర్ల రాధాకృష్ణ, కాసాని మంగేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

నవమికి రూ.2.69 కోట్ల ఆదాయం

- గత ఏడాది మీద అదనంగా రూ.80 లక్షలు

భద్రాచలం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో ఈసారి నిర్వహించిన వసంత పక్ష ప్రయుక్త శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలకు రూ.2,69,09,390 ఆదాయం వివిధ ఆర్జిత సేవల ద్వారా సమకూరింది. 2024లో రూ.1,89,61,124 ఆదాయం రాగా గత ఏడాది మీద ఈసారి రూ.80 లక్షలు అదనంగా ఆదాయం లభించింది. మార్చి 30 నుంచి ఏప్రిల్ 12 వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించగా, 6న శ్రీరామనవమిని పురస్కరించుకొని సీతారాముల కల్యాణం, 7న సీతరాముల మహా పట్టాభిషేకాన్ని నిర్వహించారు. భద్రాద్రి దేవస్థానం ఈ ఏడాది భక్తుల సదుపాయాలు, సౌకర్యాలు, ఏర్పాట్ల కోసం సుమారు రూ.2.50 కోట్ల వరకు వెచ్చించగా రూ.19 లక్షలు అదనంగా వచ్చినట్లయ్యింది. సెక్టార్ల టికెట్ల విక్రయాలు రూ.1,32,83,000, పరోక్ష సేవ రూ.03,45,000, పరోక్షసేవ (రూ.1,116లు) రూ.05,02,200, అంతరాలయ అర్చన సేవ (పోస్టల్ ద్వారా)రూ.8,78,150, తలంబ్రాలు తపాల శాఖ రూ.6,64,225, తలంబ్రాలు ఆర్టీసీ కార్గో రూ.41,09,200, తలంబ్రాలు ప్రచార శాఖ రూ.13,87,050, చిన్నలడ్డూ విక్రయాల ద్వారా రూ.49,07,775, మహా లడ్డూ విక్రయాల ద్వారా రూ.02,89,000, పులిహోర రూ.30,000, చెక్కర పొంగలి రూ.4,140, బెల్లం రవ్వ కేసరి ద్వారా రూ.2,900 సమకూరాయి.

దుమ్ముగూడేనికి గోదావరి జలాలు

- సమ్మక్క బ్యారేజీనుంచి 300క్యూసెక్కుల నీటివిడుదల
- మిషన్‌భగీరథ సరఫరాకు ఊరట

అశ్వాపురం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కుమ్మరిగూడెం వద్ద ఉన్న దుమ్ముగూడెం ఆనకట్టకు గురువారం ఎగువన ఉన్న సమ్మక్క బ్యారేజ్‌నుంచి విడుదలయిన గోదావరి జలాలు చేరాయి. దీంతో ఇప్పటివరకు ఆనకట్ట వద్ద 47.6 మీటర్లు ఉన్న నీటిమట్టం 48మీటర్లకు చేరుకోవటంతో ఈవేసవిలో మిషన్‌భగీరథ మంచి నీటి సరఫరాకు అంతరాయం తొలగినట్లయింది.

ఇటీవల దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద గోదావరి నీటిమట్టం రోజురోజుకు పడిపోతుండటంతో మే నెలలో మంచినీటి సరఫరాకు అంతరాయం కలగే ప్రమాదం ఉందని అధికారులు భావించారు. దీంతో మిషన్‌భగీరథ అధికారులు ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులతో సంప్రదింపులు చేశారు. స్పందించిన ఇరిగేషన్ అధికారులు ఈనెల 14న ఎగువన ఉన్న తుపాకులగూడెం సమ్మక్క బ్యారేజ్‌నుంచి 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం గోదావరి జలాలుదుమ్ముగూడెం ఆనకట్టకు చేరుకుంటున్నాయి. ఈనీటి మట్టం 49.6కు చేరుకుంటే వేసవిలోఉమ్మడి ఖమ్మం జిల్లాకు తాగునీటి ముప్పు తప్పినట్టేనని అధికారులు భావిస్తున్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్‌ముజమ్మిల్ ఖాన్

స్వభావం, కొలతలు తెలితేనే భూ సమస్యల పరిష్కారం

- ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

నేలకొండపల్లి, ఏప్రిల్24 (ఆంధ్రజ్యోతి): భూమి స్వభావం, కొలతలు, ఎక్కడ ఉందీ తెలితేనే భూసమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని, వీటిని దృష్టిలో పెట్టుకునే ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తెచ్చిందని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ చెప్పారు. గురువారం మండల పరిధిలోని ముజ్జుగూడెం గ్రామంలో జరిగిన భూభారతి-2025 చట్టం అవగాహనా సదస్సులో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ1 910నుంచి 1930 వరకు నైజాం కాలంలో మాత్రమే భూసర్వే జరిగిందన్నారు. భూసమస్యల పరిష్కారం సర్వేతోనే సాధ్యమవుతుందని, భూసర్వేను భూభారతి చట్టంలో పొందుపర్చటం జరిగిందన్నారు. భూహక్కుల రికార్డు మ్యుటేషన్ కోసం చేసిన దరఖాస్తులను 30 రోజుల్లోగా పూర్తి చేయాలని, లేని పక్షంలో దరఖాస్తు ఆటోమేటిక్‌గా ఆమోదం పొందినట్లేనని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. కార్యక్రమంలో తెలంగాణా వ్యవసాయ రైతు సంక్షేమ సంఘం సభ్యుడు, అడ్వకేట్ సునీల్, ఆర్డీవో నర్సింహారావు, నియోజకవర్గ ప్రత్యేకాధికారి రమేష్, ఏడీఏ సరిత, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో యర్రయ్య, ఎంఈవో రాధ, రైతులు వేగినాటి లక్ష్మీనర్సయ్య, ఉన్నం బ్రహ్మయ్య, ఉండెమోదుగుల శ్రీను, కొమ్మూరి నరేష్ పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ తోటల్లో పూత, కాత లేని మొక్కలు

- వైఫల్యం ఎక్కడనే దానిపై విచారణ
- తోటలను పరిశీలించిన ఆయిల్‌ఫెడ్ చైర్మన్ రాఘవరెడ్డి


గెలలను పరిశీలిస్తున్న ఆయిల్‌ఫెడ్ చైర్మన్

అశ్వారావుపేట రూరల్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ తోటల్లో పూత కాతలేని మొక్కలు ఉన్నాయని తేలిందని, నర్సరీల నిర్వహణ, మొక్కల పెంపకంలోనే లోపాలు జరిగి ఉంటాయని ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి అభిప్రాయపడ్డారు. ఆయిల్‌ఫెడ్ ద్వారా 2017-2 మధ్యకాలంలో రైతులకు అందించిన మొక్కల్లో ఆఫ్‌టైప్ మొక్కలు ఎక్కువగా ఉన్నాయి. తోటల్లో కాతపూత లేని మొక్కలు ఉండటంతో రైతులు ఆందోళన చేస్తున్నారు. తమ తోటలను సందర్శించాలని ఆయిల్‌ఫెడ్ యాజమాన్యాన్ని కోరుతున్నారు. ఈనేపథ్యంలో గురువారం ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, అధికారులు తోటలను సందర్శించారు. అశ్వారావుపేట, గంగారం, వాగొడ్డుగూడెంలో నున్నా రామకృష్ణ, కుంచం సుబ్బారావు, వెంకటేశ్వరావు, నాగబాబుకు చెందిన తోటలను సందర్శించారు. తోటలో కాత పూత లేని ఆఫ్‌టైప్ మొక్కలను పరిశీలించారు. ఈసందర్భంగా రైతులు తమకు జరిగిన నష్టాన్ని అధికారులకు వివరించారు. పూత కాత లేని తోటల వలన తీవ్రంగా నష్టపోయామని తమను అన్ని రకాలుగా ఆదుకోవాలని కోరారు. ఈసందర్భంగా చైర్మన్ రాఘవరెడ్డి మాట్లాడుతూ ఐదేళ్ల కాలంలో రైతులకు ఇచ్చిన మొక్కల్లోనే ఈపరిస్థితి వచ్చిందని, దీనిపై వివరాలు తెలుసుకునేందుకే నేరుగా తోటలను సందర్శిస్తున్నట్లు తెలిపారు. నర్సరీ నిర్వహణ, మొక్కల పెంపకంలో లోపాలు, చీడపీడలకు నివారణ చేపట్టకపోవటం వలనే నాణ్యతలేని మొక్కలు వస్తాయని, దీనిపై విచారణ చేస్తామని తెలిపారు. సహజంగా ప్రతితోటలోనూ ఆఫ్‌టైప్ మొక్కలు ఉంటాయని తెలిపారు. ఈవైఫల్యాన్ని ఎలా అధిగమించి రైతులకు ఎలా న్యాయం జరుగుతుందనే దానిపై ఆలోచన చేస్తామని వివరించారు. ఈసందర్భంగా రైతుసంఘం నాయకులు తుంబూరు మహేశ్వరెడ్డి, తలశిల ప్రసాద్ మాట్లాడుతూ 2017 నుంచి ఐదేళ్ల పాటు ఇచ్చిన మొక్కల వలన వందల మంది రైతులు తీవ్రంగా నష్టపోయారని, నష్టపోయిన రైతులకు పూర్తిస్థాయిలో న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఐఐఓపీఆర్ అధికారి డాక్టర్ బీఎన్ రావు, ఆయిల్‌ఫెడ్ డిప్యూటీ మేనేజర్ ప్రవీణ్‌రెడ్డి, సిద్దిపేట, కొత్తగూడెం జిల్లాల ఇన్‌చార్జ్ అధికారులు శంకర్, రాధాకృష్ణ, అశ్వారావుపేట, అప్పారావుపేట పరిశ్రమల మేనేజర్లు నాగబాబు, కళ్యాణ్, రైతు సంఘాల నాయకులు చెలికాని సూరిబాబు, వెంకట్రావు, చక్రధర్‌రెడ్డి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి. పాటిల్

మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

- భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ జితేష్ వి. పాటిల్

కొత్తగూడెం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడేన్ని మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందరంలో జిల్లాస్థాయి యాంటి డ్రగ్‌కమిటీ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, మాదకద్రవ్యాలు వినియోగం లేకుండా పోలీసులు పటిష్ఠ చర్యలు చేపట్టాలన్నారు. గంజాయి, మత్తు పదార్థాలు వినియోగించకుండాఉండేలా కళాశాలయాజామన్యాలు, తల్లిదండ్రులు పిల్లలపై దృష్ట పెట్టాలన్నారు. విద్యాసంస్థల్లో నిర్వహించే పేరెంట్స్ టీచర్ సమావేశాల్లో డ్రగ్స్ గంజాయి వినియోగం వల్లే కలిగే అనార్థాలపై అవగాహన కల్పించాలన్నారు.ఈ సమావేశంలో యాంటి నార్కోటిక్ బ్యూరో డీఎస్పీ శరత్, అసిస్టెంట్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ కరంచంద్, ఎక్సైజ్ సీఐ జానయ్య, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సంపత్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దామోదర్‌రెడ్డి

'విద్యారంగాన్ని బలోపేతం చేద్దాం'

ఖమ్మం ఖానాపురంహవేలి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేద్దామని, ఉపాధ్యాయ పెండింగ్ సమస్యలకు త్వరలోనే పరిష్కారం వస్తుందని పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులగం దామోదర్‌రెడ్డి అన్నారు. గురువారం నగరంలోని సంఘం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన కార్యనిర్వాహక వర్గ సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వ విద్య బలోపేతానికి ఉపాధ్యాయులందరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యలమద్ది. వెంకటేశ్వర్లు, రంగారావు, మోత్కూరి. మధు, తదితరులు పాల్గొన్నారు.



జీపీఎఫ్ స్లిప్పులు విడుదల చేయాలి: యూటీఎఫ్

ఖమ్మంఖానాపురంహవేలి, ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి): జీపీఎఫ్ స్లిప్పులు విడుదల చేయాలని, పార్ట్ ఫైనల్స్ ఫైనల్ పేమెంట్స్ వెంటనే విడుదల చేయాలని గురువారం యూటీఎఫ్ జిల్లాకమిటీ ఆధ్వర్యంలో జిల్లాపరిషత్ ఉపముఖ్య కార్యనిర్వాహణాధికారికి వినతిపత్రం అందించారు.ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్. రంజాన్, పారుపల్లి. నాగేశ్వరరావు మాట్లాడారు. మూడు సంవత్సరాల నుంచి స్లిప్పులు విడుదల చేయకపోవటంతో ఉపాధ్యాయులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారన్నారు.ఈ కార్యక్రమంలో నాగమల్లేశ్వరరావు, వెంకన్న, సురేష్, అరవింద్ పాల్గొన్నారు. కాగా ఉగ్రదాడిని ఖండిస్తూ మృతులకు సంతాపంగా గురువారం రాత్రి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు.

వీధి వ్యాపారుల మార్కెట్‌కు మహర్దశ

- రూ.72 లక్షలతో తిరిగి నిర్మాణం
- మూడుబ్లాక్‌ల్లో 160 దుకాణాలు
- త్వరలో ప్రారంభించనున్న తుమ్మల





వీధివ్యాపారుల మార్కెట్, ఈఈ కృష్ణలాల్, వ్యాపారులతో మాట్లాడుతున్న యుగంధర్

ఖమ్మంసంక్షేమ విభాగం, ఏప్రిల్24 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని పాత బస్టాండ్‌కు ఎదురుగా ఉన్న పురాతన కూరగాయల(వీధి వ్యాపారుల) మార్కెట్‌కు మహర్దశ పట్టనున్నది. దశాబ్దాలుగా ఈమార్కెట్‌లో ఎక్కువ సంఖ్యలో ముస్లిం కుటుంబాల వారు వ్యాపారాలు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఖమ్మం నగరంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా సౌకర్యాలను పెంపొందించటానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఎప్పటికప్పుడు కార్యచరణ చేస్తున్నారు. ఇప్పటికే ఆర్డీవో కార్యాలయం పక్కన రైతుబజార్‌ను పునః ప్రారంభించారు. నూరుశాతం రైతులే కూరగాయల అమ్మకాలు జరిపేలా వారి ఇళ్లకే వెళ్లి గుర్తింపు కార్డులను అందించి ప్రోత్సహించారు. ఇదే క్రమంలో ఖమ్మం పాత బస్టాండ్ ఎదురుగా ఉన్న దశాబ్దాల నాటి కూరగాయల మార్కెట్‌ను ఆధునికీకరించేందుకు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు కార్యచరణ చేశారు. రూ.72 లక్షలతో అభివృద్ధి చేసేందుకు ముందుకు వచ్చారు. కూరగాయల మార్కెట్‌లో పాతపడిన దుకాణాలను తొలగించి వాటిలో మూడు బ్లాక్‌లుగా ఏర్పాటు చేయనున్నారు.ఇందుకోసం 1,452 గజాల్లో మూడుషెడ్‌లు నిర్మాణం జరగనుంది. ప్రతీబ్లాక్ షెడ్‌కు ప్రజలు కూరగాయలు కొనుగోలు చేసేలా విశాలమైన నడిచే దారి ఏర్పాటు చేస్తున్నారు. 150 నుంచి 160 వరకు కూరగాయల దుకాణాలు ఏర్పాటుకు ప్రణాళిక రూపొందించారు. వ్యాపారులు, ప్రజల సౌకర్యార్థం మరుగుదొడ్ల నిర్మాణం జరగనుంది.

కేఎంసీ ఈఈ, వ్యాపారులతో సమావేశమైన తుమ్మల యుగంధర్

కూరగాయల మార్కెట్ పునఃనిర్మాణంపై ఖమ్మం నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ పర్యవేక్షక అధికారి కృష్ణలాల్‌తో పాటుగా కూరగాయల వ్యాపారులతో కాంగ్రెస్ నాయకుడు తుమ్మల యుగంధర్ గురువారం సమావేశమైనారు. కూరగాయల మార్కెట్ ఆధునికీకరణపై వ్యాపారుల సూచనలు, సలహాలు తీసుకున్నారు. మార్కెట్ నిర్మాణంలో వ్యాపారులకు ఇబ్బంది లేకుండా అధికారులు ఏర్పాట్లు చేయాలని యుగంధర్ సూచించారు. త్వరలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపనలు చేసేందుకు ఏర్పాటు చేస్తున్నామని ఈఈ కృష్ణలాల్ ఆంధ్రజ్యోతికి తెలిపారు.

గంగమ్మతల్లి విగ్రహాల ఊరేగింపు

నేలకొండపల్లి, ఏప్రిల్24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని భైరవునిపల్లిలో గురువారం గంగమ్మతల్లి, పోతురాజుల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. మహిళలు ఆటా, పాటలతో జల బిందెలను నెత్తిన పెట్టుకుని గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. ఓలింగా, జైలింగా నినాదాలతో గ్రామం మారుమోగింది. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కనకబండి సీతారాములు,పెద్దగొల్ల బాలిన నారాయణ, యాదవ సంఘం నాయకులు బొల్లం సత్యనారాయణ, కనకబండి కనకరాజు,నూక హనుమంతరావు పాల్గొన్నారు.

8.8కిలోల కణితి తొలగింపు

ఖమ్మంకలెక్టరేట్‌ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి): మమత ఆస్పత్రిలో ఓ మహిళకు కడుపు నుంచి 8.8 కిలోల కణితిని తొలగించారు. మమత ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్ పువ్వాడ నరేన్, ఆస్పత్రి వైద్యులు గురువారం విలేకరుల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. సూర్యాపేట జిల్లా రంగాపురం గ్రామానికి చెందిన 75ఏళ్ల సుశీల తీవ్రకడుపు నొప్పితో ఇటీవల మమత ఆస్పత్రిలో చేరింది. ప్రొఫెసర్ డాక్టర్ నైమీషా పరీక్షల అనంతరం కడుపులో గణతి ఉన్నట్లు గుర్తించారు. గర్భసంచి పక్కనే ఉన్న కణితి కారణంగా ఆమె ఇబ్బందిపడినట్లు తెలిపారు. వైద్యులు ముద్రగడ ఇందు, హర్షిక, గీత ఆధ్వర్యంలో ఆపరేషన్ చేసి కణితిని తొలగించారు. అనస్తీషియా బృందాన్ని డైరెక్టర్ డాక్టర్ పువ్వాడ నరేన్ అభినందించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

కామేపల్లి,ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి): రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించుకోవాలని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. గురువారం కామేపల్లి పీఏసీఎస్ పరిధిలోని కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయ కమిషన్ డైరెక్టర్ రాంరెడ్డి గోపాల్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పుచ్చకాయల వీరభద్రం, డీసీసీబీ డైరెక్టర్ మేకలమల్లిబాబు, గుజ్జర్లపుడి రాంబాబు, గ్రబూ, బావ్‌సింగ్, నర్సింహరెడ్డి, డీఎస్, జగన్నాథరెడ్డి, తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీఓ రవీందర్ పాల్గొన్నారు.

పేలుడు సామగ్రి పట్టివేత

తిరుమలాయపాలెం, ఏప్రిల్24 (ఆంధ్రజ్యోతి) మండలంలో గురువారం పేలుడు సామగ్రిని టాస్క్‌ఫోర్స్ సీఐ తిరుపతి ఆధ్వర్యంలో పట్టుకున్నారు. సూర్యాపేటకు చెందిన రూపాని శ్రీనివాస్ పిండిప్రోలు సమీపంలో వ్యవసాయ క్షేత్రంలో పేలుడు సామగ్రితో ఉండగా అదుపులోకి తీసుకున్నారు. 3రెడ్‌వైర్ బండిళ్లు, 4జిలిటెన్స్ స్టిక్స్ 320 స్టిక్స్ కంకులను స్వాధీనం చేసుకుని, కేసునమోదు చేశారు.

ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి: జేఏసీ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టీజీవో నాయకులు

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): గెజిటెడ్ ఉద్యోగులు ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యల సాధనకు టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో నేడు ఖమ్మంలో జరిగే ఉద్యోగ సదస్సును విజయవంతం చేయాలని టీజీఈజేఏసీ చైర్మన్ గుంటుపల్లి శ్రీనివాసరావు, కస్తాల సత్యనారాయణ కోరారు. ఐడీఓసీ నుంచి జరిగే మోటార్ బైక్ ర్యాలీతో పాటు టీఎన్జీవో ఫంక్షన్ హాల్‌లో జరిగే ఉద్యోగ సదస్సును జయప్రదం చేయాలని కోరారు. గురువారం సాయంత్రం టీజీవో భవనంలో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఉద్యోగుల జేఏసీ పోస్టర్‌ను జిల్లా చైర్మన్ గుంటుపల్లి శ్రీనివాస్, జిల్లా కన్వీనర్ కస్తాల సత్యనారాయణ,టీజీవో జిల్లా కార్యదర్శి మోదుగు వేలాద్రి, మహిళా గెజిటెడ్ అధ్యక్షురాలు ఉషాశ్రీ కార్యదర్శి, పి.సుధారాణి, విజయ్‌కుమారి, టీజీవో హౌస్‌బిల్డింగ్ సొసైటీ జిల్లా కార్యదర్శి డాక్టర్ పి.విజయ్ కుమార్, జిల్లాకార్యవర్గ సభ్యులు సూరంపల్లి రాంబాబు జెల్లి, పుష్పరాజ్, డాక్టర్ హరీష్ శంకర్ నాయక్, టీఎన్జీవో జిల్లా నాయకులు తాళ్లూరి శ్రీకాంత్, జైపాల్, శ్రీధర్‌సింగ్, రుక్మారావు,కోణార్, వీరన్న, పాపాలాల్ టీజీవో జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు

వేగంగా రాజీవ్ యువ వికాసం క్షేత్రస్థాయి సర్వే

ఖమ్మంసంక్షేమవిభాగం, ఏప్రిల్24 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలో రాజీవ్ యువ వికాసం దరఖాస్తుదారుల క్షేత్రస్థాయిలో సర్వే వేగంగా జరుగుతుంది. ఇప్పటికే మెప్మా ఆధ్వర్యంలో దరఖాస్తులను ఆన్‌లైన్‌లో విభజన చేశారు. ఖమ్మంనగరంలో 13వేల వరకు దరఖాస్తులు రాగా గురువారం వరకు 3వేల దరఖాస్తుల పరిశీలన పూర్తి జరిగింది. ఈనెల చివరి వరకు నూరుశాతం దరఖాస్తుల పరిశీలన పూర్తి చేసేందుకు బృందాలు పనిచేస్తున్నాయి. డివిజన్‌ల వార్డు ఆఫీసర్లు, మెప్మా ఆర్పీలు, ఇతర సభ్యులు కలిసి రాజీవ్ యువ వికాసం మార్గదర్శకాల మేరకు పరిశీలన చేస్తున్నారు. దరఖాస్తులు ఆన్‌లైన్ జరిగి హార్డ్ కాపీలను ఖమ్మం నగర పాలక సంస్థ అధికారులు స్వీకరిస్తున్నారు.

చెల్లని చెక్కు కేసులో 6 నెలల జైలు

ఖమ్మంలీగల్, ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని ప్రశాంతినగర్‌కు చెందిన పుచ్చకాయల అనంతరాములుకి చెల్లని చెక్కు కేసులో 6నెలలు జైలుశిక్ష తోపాటు ఫిర్యాదికి రూ.4లక్షల54వేలు నష్టపరిహారం కింద చెల్లించాలని ఖమ్మంరెండో అదనపు ప్రథమశ్రేణి కోర్టు న్యాయాధికారి ఏపూరి బిందుప్రియ గురువారం తీర్పుచెప్పారు. రఘునాథపాలెం మండలం వీ.వెంకటాయపాలేనికి చెందిన ఫిర్యాది జి.రాంమూర్తి వద్ద నిందితుడు 2021లో రూ.3,80,000అప్పుగా తీసుకున్నాడు. రుణం తిరిగి చెల్లించమని ఒత్తిడి చేయగా నిందితుడు 2022న చెక్కు జారీ చేశాడు. ఆ చెక్కును బ్యాంకులో జమచేయగా నగదు లేనందున చెక్కు తిరస్కరణకు గురైంది. ఫిర్యాది కోర్టులోప్రైవేటుకేసు దాఖలు చేశాడు.

మరో కేసులో 6 నెలలు జైలు

ఖమ్మంనగరంలోని టేకులపల్లికి చెందిన జి.ధనుంజయ్‌కి చెల్లనిచెక్కు కేసులో 6 నెలలు జైలుశిక్ష తోపాటు ఫిర్యాదికి రూ.5 లక్షల నష్టపరిహారం చెల్లించాలని ఖమ్మం రెండో అదనపు ప్రథమశ్రేణికోర్టు న్యాయవాధికారి ఏపూరి బిందుప్రియ గురువారం తీర్పుచెప్పారు. ఖమ్మంలోని ద్వారకానగర్ ప్రాంతానికి చెందిన ఫిర్యాది పి.వాసు వద్ద నిందితుడు 2016న రూ.5లక్షలు అప్పుగా తీసుకున్నాడు. 2018న రూ.5లక్షల రూపాయలకు చెక్కు జారీ చేశాడు. ఆ చెక్కును బ్యాంకు ఖాతాలో జమచేయగా సరిపడ నగదు లేనందున చెక్కు తిరస్కరణకు గురైంది. ఫిర్యాది తన న్యాయవాది ద్వారా లీగల్ నోటీసు జారీచేసి కోర్టులో ప్రైవేటు కేసు దాఖలు చేశాడు.

సంజయ్ సింగ్వీ మృతి తీరని లోటు

టీయూసీఐ జిల్లా సహాయ కార్యదర్శి

నేలకొండపల్లి, ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి): ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా(టీయూసీఐ) జాతీయ కార్యదర్శి సంజయ్‌సింగ్వీ మృతి దేశకార్మికవర్గానికి తీరని లోటని టీయూసీఐ జిల్లా సహాయకార్యదర్శి పగిడికత్తుల రాందాసు అన్నారు. గురువారం నేలకొండపల్లిలో జరిగిన కార్యక్రమంలో సింగ్వీ చిత్రపటానికి పూలమాలలేసి ఘన నివాళులర్పించారు. సింగ్వీని కార్మికవర్గం ఆదర్శంగా తీసుకుని, ఆయన ఆశయ సాధన కోసం ఉద్యమించటమే ఆయనకిచ్చే నిజమైన నివాళి అని రాందాసు అన్నారు. కార్యక్రమంలో కొండపల్లి జార్జి, పగిడికత్తుల శ్రీను, షేక్.అక్బర్, అనూష, సూరమ్మ, అమరావతి, మార్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్యూరిఫయర్ ఏర్పాటు

ఖమ్మంరూరల్,ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి): ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని జలగంనగర్ లోని ప్రభుత్వపాఠశాలలో మంత్రిపొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సొంతనిధులతో వాటర్‌ప్యూరిఫయర్‌ను ఏర్పాటు చేశారు. గురువారం క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ దయాకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాంమూర్తి నాయక్, అశోక్ నాయక్ పాల్గొన్నారు.

నేటినుంచి అయ్యప్పస్వామి బ్రహ్మోత్సవాలు

ఖమ్మంఖానాపురంహవేలి, ఏప్రిల్24 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శ్రీనివాసనగర్ లోని శ్రీశాస్తా దేవస్థానం అయ్యప్ప స్వామి దేవాలయ 39వ బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి మే4వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ చిల్లంచర్ల. రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి రాయపూడి. వెంకటరమణ, కోశాధికారి పసుమర్తి. రంగారావు తెలిపారు. ఆలయ తంత్రి దామోదరన్ బృందం, ఆలయ ప్రధాన పూజారి పాతికల్లం నారాయణన్ నంబూద్రి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 26న వాస్తు హోమం, రక్షోఘ్న హోమం, 27న ఆదిత్య హోమం,సుదర్శన హోమం, 28న మృత్యుంజయ హోమం, అఘోర హోమం, 29న కుజ శాంతి హోమం, గురుతి తర్పణం, 30న నవగ్రహశాంతి హోమం, ఆశ్వారూఢ హోమం, మే 1న గాయత్రి హోమం, సర్వబలి,2న రాజశ్యామల హోమం, 3న సహస్ర కలశాభిషేకం, 4న మహా గణపతి హోమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మంత్రి తుమ్మలకు కేఎంసీ కార్మికుల కృతజ్ఞతలు

ఖమ్మంసంక్షేమవిభాగం, ఏప్రిల్24 (ఆంధ్రజ్యోతి): మెప్మా ద్వారా పూర్తి స్థాయిలో వేతనాలు ఇవ్వటంతో ఖమ్మం నగర పాలక సంస్థ కీపింగ్ కార్మికులు మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. గురువారం క్యాంపు కార్యాలయంలో 24 మంది కార్మికులు తుమ్మలకు పుష్పగుచ్ఛాన్ని అందించి, స్వీట్లు తినిపించారు. తుమ్మల వారికి స్వీట్లు తినిపించటంతో మహిళా కార్మికులు ఎంతో సంతోషపడ్డారు. మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్ కమర్తపు మురళీ, టీఎంసీ గుడిపూడి సుజాతరాణి పాల్గొన్నారు. అంతకుముందు ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కీపింగ్ కార్మికులు మేయర్ పునుకొల్లు నీరజను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. స్వీట్లు పంపిణీ చేశారు.

ప్రతీ గ్రామంలో మునగ సాగు చేయించాలి

కామేపల్లి, ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి): ప్రతీ గ్రామ పంచాయితీలో రెండు ఎకరాల మునగ సాగు చేయించాలని కల్లూరు డివిజన్ ఏపీడీ బీవీ చలపతిరావు సూచించారు.గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రివ్యూ మీటింగ్‌లో మాట్లాడారు. మునగ సాగు విస్తీర్ణం పెంచాలని తెలిపారు. ప్రతి పంచాయతీ నుంచి రోజుకు 150 నుంచి 200 మంది ఉపాధి కూలీలు పని చేసేవిధంగా రూపకల్పన చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ రవీందర్, ఏపీఓ శ్రీరాణి, ఈసీ వెంకటేశ్వర్లు, టీఏలు బావ్‌సింగ్, భాస్కర్ ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన న్యాయాధికారి మురళీమోహన్



ఖమ్మంలీగల్, ఏప్రిల్24 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం రెండో అదనపు సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి టి.మురళి మోహన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు మేడ్చల్ మల్కాజ్‌గిరి కుషాయగూడలో సీనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వహించారు. బదిలీపై ఖమ్మం వచ్చారు.

న్యాయవాద సంక్షేమసంఘ సొసైటీ ఎన్నికలకు ఆరు నామినేషన్లు

ఖమ్మంలీగల్, ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి): మే2న జరగనున్న న్యాయవాద సంక్షేమసంఘ సొసైటీ ఎన్నికలకు గురువారం నాలుగు డైరెక్టర్ పదవులకు ఆరునామినేషన్లు దాఖలు అయ్యాయి. నేడు పరిశీలన అనంతరం తుదిజాబితా ప్రకటించనున్నారు. సొసైటీలో మొత్తం 549 ఓట్లు ఉన్నాయి. ఇప్పటికే పోటీలో ఉన్న అభ్యర్థులు గెలుపుకోసం తీవ్రప్రయత్నాలు చేస్తున్నారు. ఎన్నికల్లో నామినేషన్లు వేసినవారు ఆవుల అనురాధ, షేక్.నజరీన్, వల్లపు లింగయ్య, కొలకలూరి ప్రసాద్, కాసర రాజశేఖర్‌రెడ్డి, పాలవెల్లి వెంకటేశ్వర్లు నామినేషన్లు దాఖలు చేసినట్లుగా ఎన్నికల అధికారి గుడ్డేటి రమేష్ తెలిపారు.

ఉపాధి హామీ పనులు కొనసాగించాలి

ఖమ్మంరూరల్,ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి):ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనులు కొనసాగించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ అధికారులను కోరారు. గురువారం గిరిప్రసాద్ భవన్‌లో జరిగిన సీపీఐకార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఉపాధి హామీ పథకం అమలు చేయకపోవడంతో నిరుపేదలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి ఉపాధి పథకాన్ని కొనసాగించాలని కోరారు.ఈసమావేశంలో రాష్ట్రకంట్రోల్ కమిటీ చైర్మన్ మహ్మద్ మౌలానా, చిన్న వెంకటరెడ్డి, రాంమూర్తి, సుధాకర్ పాల్గొన్నారు.

నేడు ఎస్‌బీఐటీలో జాతీయ స్థాయి ఆరోహన్ టెక్నికల్ సింపోజియం

ఖమ్మంఖానాపురంహవేలి, ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి):నగరంలోని ఎస్‌బీఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం జాతీయ స్థాయి ఆరోహన్ టెక్నికల్ సింపోజియం నిర్వహిస్తున్నట్లు కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. దీనికి సంబందించి గురువారం కళాశాలలో పోస్టర్ ఆవిష్కరించారు. ఎస్‌బీఐటీ కళాశాల విద్యార్థుల తోపాటు, జిల్లాలోని ఇతర విద్యార్థులకు సాంకేతిక పోటీలైన పవర్ పాయింట్ ప్రజెంటేషన్, స్లైడ్‌డెక్, కోడింగ్ క్లబ్, టెక్నికల్ క్విజ్ తోపాటు ట్రెజర్ హంట్ తదితర పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

ధాన్యాన్ని వేగంగా కొనుగోలు చేయాలి

- ఎండలేని సమయాల్లోనే కాంటా వేయాలి
- అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి



రాష్ట్ర బృందం సభ్యులతో సమావేశం నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

ఖమ్మంకలెక్టరేట్, ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాలకు వచ్చే నాణ్యమైన ధాన్యాన్ని త్వరితగతిన కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.కలెక్టరేట్‌లోనీ తన ఛాంబర్‌లో ఆయన ధాన్యంకొనుగోలుపై రాష్ట్ర బృందంతో, ఐకేపీ, ప్యాక్స్, డీసీఎంఎస్, మెప్మా అధికారులతో సమావేశం నిర్వహించారు. అంతకుముందు పౌర సరఫరాల కమీషనర్ కార్యాలయం నుంచి డిప్యూటీ కమిషనర్, జనరల్ మేనేజర్ ప్రొక్యూర్‌మెంట్, ఎస్‌డబ్ల్యూసీ జనరల్ మేనేజర్ కూసుమంచి మండలం పాలేరు గ్రామంలో ఐకేపీధాన్యం కొనుగోలు కేంద్రాలను, నేలకొండపల్లి మండలంలోని అరుణాచల రైస్‌మిల్లును తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు రికార్డు పరిశీలించిన రాష్ట్ర బృందం కొనుగోళ్ల సీరియల్ నెంబర్ పాటించాలని, కాంటా వేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు నిర్దేశించిన రైస్‌మిల్లులకు తరలించాలన్నారు. ఎండ లేని సమయాల్లోనే కాంటా వేయాలని, రైతులకు తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్ అందుబాటులో ఉంచాలని సూచించారు. రైస్ మిల్లుల వద్ద కొనుగోలు కేంద్రం నుంచి వచ్చిన ధాన్యం త్వరితగతిన అన్‌లోడ్ చేసి వివరాలను ఓపీఎంఎస్‌లో అప్ డేట్ చేయాలన్నారు.ప్రభుత్వానికి చెల్లించాల్సిన బియ్యం మేనెల వరకు చెల్లించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు రైతుల వద్ద నుంచి 29వేల695 టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, జిల్లాలో 799 మంది రైతుల నుంచి 6వేల 165 క్వింటాళ్ల సన్న రకం ధాన్యం కొనుగోలు చేసి 3 కోట్ల 8 లక్షల 25 వేల 600 రూపాయలు బోనస్ రూపంలో చెల్లించామని తెలిపారు. ఈ సమావేశంలో పౌరసరఫరాల డిప్యూటీ కమీషనర్ కొండల్‌రావు,జనరల్ మేనేజర్ నాగేశ్వరరావు, జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారి చందన్‌కుమార్, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ శ్రీలత, డీటీ (సీఎస్.), ఖమ్మంరూరల్, నేలకొండపల్లి సీఎస్.ఆర్.ఐలు పాల్గొన్నారు.

కేంద్ర బృందాల శాంపిల్ సర్వే ప్రారంభం

ఖమ్మంసంక్షేమవిభాగం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ బృందాల ఆధ్వర్యంలో నగరంలోని జాతీయ శ్యాంపిల్ సర్వే గురువారం ప్రారంభమైంది. అసిస్టెంట్ కమిషనర్ అహ్మద్ షఫీ ఉల్లా సర్వే బృందాలతో సమావేశమైనారు. రెవెన్యూ ఏఎస్వోతో పాటుగా కేఎంసీ జవాన్లు, మెప్మా ఆర్పీలను సర్వే బృందంలో సభ్యులుగా నియామకం చేశారు. 44వ డివిజన్‌ను సర్వేకు ఎంపిక చేశారు. ఎంపిక చేసిన ప్రాంతంలో కుటుంబ యజమాని నుంచి వైద్య వ్యయం వివరాలు సేకరిస్తారు. సర్వేలో కుటుంబ యజమాని ఇచ్చిన సమాచారం గోప్యంగా ఉంచబడుతుందని ఏఎంసీ అహ్మద్‌షఫీఉల్లా తెలిపారు. సర్వే బృందాలకు ప్రజలు సహకరించాలని కోరారు. కేఎంసీ ఎకౌంట్స్ ఆఫీసర్ శివలింగం, ఖమ్మం రెవెన్యూ అసిస్టెంట్ స్టాటికల్ ఆఫీసర్ నాగేశ్వరరావు, పారిశుద్య పర్యవేక్షకులు సాంబయ్య, ఆర్పీలు సమీనా, పద్మసుమిత్ర, పాతిమా పాల్గొన్నారు.



డైట్ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

ఖమ్మం ఖానాపురంహవేలి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి):32 సంవత్సరాల అనంతరం ఆదర్శ ఉపాధ్యాయుల అపూర్వ సమ్మేళనం గురువారం నగరంలోని డైట్ కళాశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అప్పటి గురువులుతో పాటు ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాలో పనిచేస్తున్న పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. చనిపోయిన నాటి మిత్రులుకు రెండు నిమిషాలు మౌనం పాటించారు. 1992-93లో టీటీసీ విద్యను అభ్యసించి నేడు ఆదర్శ ఉపాధ్యాయులుగా , ఉత్తమ ఉపాధ్యాయులుగా జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవార్డులు పొందిన ఉపాధ్యాయులందరూ తమ విద్యార్థులు కావటం గర్వంగాఉందని అప్పటి గురువులు ప్రిన్సిపాల్ బాలయ్య, సుదర్శన్‌రెడ్డి, సత్యనారాయణ, బసవరాజు, విష్ణుమూర్తి అన్నారు. అనంతరం గురువులను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో శ్రీనివాసరాజు, భాస్కర్, భైరెడ్డి వెంకటరెడ్డి, హరిత, సుజాత, శ్రీనివాస్, రాజ నరేష్, బుచ్చి రామయ్య తదితరులు పాల్గొన్నారు.



మేయర్ దంపతుల పరామర్శ



ఖమ్మంసంక్షేమవిభాగం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన సుగ్గలవారితోట ప్రాంతానికి చెందిన కిరణ్‌ను గురువారం మేయర్ దంపతులు పునుకొల్లు నీరజ,రామబ్రహ్మం దంపతులు పరామర్శించారు. కిరణ్ ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని ప్రమాదానికి కారణాలను తెలుసుకున్నారు. రూ.5వేలు అందించారు. నాయకులు బుజ్జి, ప్రసాద్, రాము, మీరా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి సన్మానం

ఖమ్మంసంక్షేమవిభాగం, ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి): 6వ డివిజన్ పరిధిలోని ఖానాపురం ప్రశాంతినగర్‌కు చెందిన ఇంటర్ విద్యార్థిని మేదర రోహిణి 991 మార్కులు సాధించారు. గురువారం డివిజన్ కార్యాలయంలో కార్పొరేటర్ నాగండ్ల కోటేశ్వరరావు విద్యార్థిని రోహిణిని సన్మానించారు.

ఉగ్రదాడి దిగ్భ్రాంతి కలిగించింది

ఖమ్మంబైపాస్‌రోడ్,ఏప్రిల్24 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రదాడిని బీజేపీ రాష్ట్ర నాయకుడు తాండ్ర వినోదరావు గురువారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. దాడిలో 28మంది అమాయకులు ప్రాణాలు కోల్పోవడం దిగ్భ్రాంతి కలిగించిందన్నారు. ప్రాణాలు కోల్పోయిన వారికి ప్రభుత్వం పూర్తిగా అండగా ఉంటుందన్నారు.

ముస్లిం జేఏసీ అధ్యక్షుడిగా సుభాన్

నేలకొండపల్లి, ఏప్రిల్24 (ఆంధ్రజ్యోతి): నేలకొండపల్లి మండల ముస్లిం జేఏసీ అధ్యక్షుడిగా నేలకొండపల్లికి చెందిన షేక్.సుభాన్‌ను నియమించారు. బోదులబండకు చెందిన షేక్.ఖాజామియా, నేలకొండపల్లికి చెందిన యండి.షాకీర్, అబ్దుల్ సభ్యులుగా నియమితులయ్యారు. కశ్మీర్‌లోని పహల్గాంలో పాక్ ఉగ్రవాదులు జరిపిన మారణహోమాన్ని సుభాన్ తీవ్రంగా ఖండించారు. అంతకు ముందు జేఏసీ అధ్యక్షుడు, సభ్యులను శాలువాలతో ఘనంగా సన్మానించారు.

భరతనాట్య నృత్య వేడుకలు

ఖమ్మంఖానాపురంహవేలి, ఏప్రిల్24 (ఆంధ్రజ్యోతి): నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో గురువారం భరతనాట్య నృత్య వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాఠశాల విద్యార్థులు పాల్గొని ప్రతిభ చాటారు. నగరంలోని హార్వెస్ట్ టెండర్ రూట్స్ పాఠశాల విద్యార్థిని రాచకొండ. నిధిశ్రీ నందన నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు

» రక్షణ వలయాలు ఏర్పాటు చేయాలని వినతి
» పట్టించుకోని అధికారులు

ఏన్కూరు, ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి): ఏన్కూరు ఎస్సీకాలనీలో ఇండ్ల మధ్య విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ అత్యంత ప్రమాదకరంగా ఉంది. అయినా విద్యుత్ శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. ఇళ్ల మధ్య భూమి లెవల్‌లో ప్రమాదంగా ఉండడంతో చుట్టుపక్కల ఇండ్ల వారు ఎప్పుడు ఏ ప్రమా దం జరుగుతుందోనని భయపడుతున్నారు ట్రాన్స్‌ఫార్మర్ల మీద పడి కోళ్లు చనిపోతున్నట్టు కాలనీవాసులు ఆవేదన చెందుతున్నారు. చుట్టు రక్షణగా కంచెను కూడా ఏర్పాటు చేయకపోవడం పట్ల అధికారులపై కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈవిషయమై గతంలో ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి ట్రాన్సుఫార్మర్ల ఎత్తు పెంపు చర్యలు చేపట్టారు హడావుడిగా దిమ్మెలను ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. సుమారు రెండేళ్లు గడుస్తున్నా ఆవైపే కన్నెత్తి కూడా చూడకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం. ఫిర్యాదు చేస్తే అదిగో ఇదిగో అంటూకాలం వెళ్లదీస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేపట్టి రక్షణ చర్యలు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.



ఏన్కూర్ ఎస్సీ కాలనీలో దిమ్మెలు కట్టి వదిలేసిన దృశ్యం



బురద రాఘవాపురంలో తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

రక్షణ వలయాలు ఏర్పాటు చేయాలి

● చిలుకూరి హర్షవర్ధన్, ఎస్సీకాలనీ వాసి, ఏన్కూరు



ఓవర్‌లోడు వల్ల ట్రాన్సుఫార్మర్లు పేలి శబ్దాలు రావడంతోపాటు నిప్పులు పడుతుండడంతో భయం వేస్తుంది. ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ వలయాలు ఏర్పాటు చేయాలి. వర్షాకాలంలో వరద నిండిపోతుంది. ఈవిషయమై ఏఈ, ఏడీలకు ఫిర్యాదుచేసినా పట్టించుకోవడం లేదు.

మధిర న్యాయమూర్తిగా ప్రశాంతి బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న న్యాయమూర్తి

మధిరటౌన్, ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి): మధిర సీనియర్ సివిల్ జడ్జ్ కోర్టు నూతన న్యాయమూర్తిగా ఎన్. ప్రశాంతి గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇన్‌చార్జి న్యాయమూర్తిగా పనిచేస్తున్న కాసిం సాహెబ్ నుంచి ఆమె బాధ్యతలు స్వీకరించారు. సికింద్రాబాద్ మెట్రో పాలిటిన్ కోర్టు నుంచి ఆమె బదిలీపై మధిర కోర్టుకు వచ్చారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బోజడ్ల పుల్లారావు, న్యాయవాదులు, సిబ్బంది ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

గోదాంల పరిశీలన



రైతులతో మాట్లాడుతున్న రాయల

మధిరరూరల్, ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి): మండలంలోని దెందుకూరు గల గోడౌన్లను రాష్ట్ర గిడ్డంగుల సంస్థచైర్మన్ రాయల నాగేశ్వరావు గురువారం సందర్శించారు గోదాంల్లోఉన్న సన్నబియ్యం, నిల్వలను ఆయన పరిశీలించారు. గోడౌన్ల సామర్థ్యంతో పాటు ఎంతమంది హమాలీలున్నారు లాంటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మార్కెట్ చైర్మన్‌నరసింహారావు, ఖమ్మంజిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు వేజెండ్ల సాయికుమార్ పాల్గొన్నారు.

వర్షపు నీటిని ఒడిసి పట్టాలి

» మునిసిపల్ కమిషనర్ నర్సింహ



మాట్లాడుతున్న కమిషనర్ నర్సింహ

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్24 (ఆంధ్రజ్యోతి): రానున్న రోజుల్లో భూగర్భ జలాలు అడుగంటి పోయే విపత్కర పరిస్థితి రాకుండా ఉండాలంటే ప్రతివర్షపు నీటిని ఒడిసి పట్టాలని మునిసిపల్ కమిషనర్ కొండ్రా నర్సింహ కోరారు. గురువారం ఆయన జలసంరక్షణ చర్యలలో భాగంగా సత్తుపల్లి పట్టణంలోని ఆయా ప్రాంతాలలో పర్యటించి పలు సూచనలు చేశారు. ప్రతి ఇంటిపై పడిన వర్షపు నీరు భూమిలో ఇంకేలా ఖాళీ స్థల్లాల్లోనూ, ప్రతి ఇంటిలో ఇంకుడుగుంత నిర్మించాలని, కొత్తగా నిర్మించే గృహాలకు అనుమతి మంజూరు చేసేక్రమంలో అధికారులు తప్పనిసరిగా ఇంకుడుగుంతల నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బోర్లు తవ్వినప్పుడు వాల్టా చట్టం నిబంధనలు అమలుకు చర్యలు చేపట్టాలని కోరారు.

మేడే వేడుకలను జయప్రదం చేయండి

సీఐటీయూ పట్టణ కన్వీనర్ రామారావు



మాట్లాడుతున్న రామారావు

వైరా, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మేడే వేడుకలను జయప్రదం చేయాలని సీఐటీయూ వైరా పట్టణ కన్వీనర్ అనుమోలు రామారావు కోరారు. మేడే వేడుకల విజయవంతం కోసం గురువారం వైరాలో నిర్వహించిన సీఐటీయూ పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా మేడే వేడుకలను ప్రతిబింబించే విధంగా విజయవంతం చేయాలని కోరారు. అన్నివర్గాల కార్మికులు ఎర్రజెండా సత్తా చాటాలని పిలుపునిచ్చారు. నాయకులు పాపగంటి రాంబాబు, బండ్ల వెంకటేశ్వర్లు, పణితి వెంకటేశ్వర్లు, నూకల వెంకటేశ్వర్లు, కృష్ణమూర్తి, గిరి పాల్గొన్నారు.

స్వయం శక్తితో ఆర్థికంగా బలపడాలి

» ఎమ్మెల్యే మట్టా రాగమయి

కల్లూరు, ఏప్రిల్24 (ఆంధ్రజ్యోతి): మహిళలు స్వయం శక్తితో ఆర్థికంగా బలపడాలని ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. కల్లూరులో గురువారం ఇందిరా మహిళ శక్తి టీ స్టాల్‌ను ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కల్లూరు ఏఎంసీ చైర్మన్ బాగం నీరజదేవి, పసుమర్తి చందర్‌రావు, ఎంపీడీవో చంద్రశేఖర్, ఏపీఎం రాంబాబు, టీస్టాల్ నిర్వాహకురాలు వెంగల సుజాత, ములుగుమాటి శైలజ తదితరులున్నారు.



ఇందిరా మహిళ శక్తి టీస్టాల్‌ను ప్రారంభిస్తున్న సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి

పర్యావరణ ప్రేమికుడు రామయ్య

పెనుబల్లి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పద్మశ్రీ వనజీవి రామయ్య తన జీవితకాలంలో కోటి మొక్కలు నాటిన మహోన్నత వ్యక్తిని ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. పెనుబల్లి ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన రామయ్య సంతాప సభలో పాల్గొని మాట్లాడారు. అనంతరం కార్యాలయంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కల్లూరు ఏఎంసీ చైర్మన్ బాగం నీరజాప్రభాకర్‌చౌదరి, వైస్‌చైర్మన్ రాజబోయిన కోటేశ్వరరావు, ఎంపీడీవో అన్నపూర్ణ, తహసీల్దార్ గంటా ప్రతాప్, పంది వెంకటేశ్వరరావు, చీకటి రామారావు, పసుమర్తి విశ్వనాథ్, పొట్లపల్లి వెంకటేశ్వరరావు, మిట్టపల్లి కిరణ్‌కుమార్, భూక్యా ప్రసాద్, వంగా నిరంజన్ గౌడ్, కవి, రిటైర్డ్ ఉపాధ్యాయుడు గోపిశెట్టి వెంకటేశ్వరరావు, గంగాధర్ పాల్గొన్నారు.

ముక్తకంఠంతో ఖండిద్దాం

సత్తుపల్లి, ఏప్రిల్24 (ఆంధ్రజ్యోతి): కులమతాలకు అతీతంగా మానవత్వంతో మనమంతా ముక్తకంఠంతో ఖండించాలని ఎమ్మెల్యే మట్టా రాగమయి కోరారు. ఉగ్రవాద దాడులకు నిరసనగా గురువారం రాత్రి ఎమ్మెల్యే ఆధ్వర్యంలో కులమతాలకు అతీతంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ మట్టా దయానంద్, చల్లగుళ్ల నరసింహారావు, అలవాల కరుణాకర్, గాదె చెన్నారావు, ఎండీ.కమల్‌పాషా, గ్రాండ్ మౌలాలీ తదితరులు పాల్గొన్నారు.



సత్తుపల్లి పట్టణంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే రాగమయి

పరిష్కారం చూపించడమే భూభారతి లక్ష్యం

» ఆర్డీవో నర్సింహారావు

బోనకల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): భూసమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించడమే భూభారతి చట్టం లక్ష్యమని ఆర్డీవో జి.నర్సింహారావు తెలిపారు. స్థానిక ఎస్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో గురువారం రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో భూభారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూములకు సంబంధించి పెండింగ్ సమస్యలను సత్వరమే పరిష్కరించే విధంగా భూభారతి చట్టం పనిచేస్తుందన్నారు. రెండెంచల వ్యవస్థ ద్వారా రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా నిర్ణీత గడువులోగా భూసమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక వ్యవస్థ ఉంటుందన్నారు. అన్ని సమస్యలకు పరిష్కారం చూపుతామని తెలిపారు కార్యక్రమంలో డీపీవో ఆశాలత, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఆత్మకమిటీ చైర్మన్ కర్నాటి రామకోటేశ్వరరావు, తహసీల్దార్ పున్నం చందర్, మండల ప్రత్యేక అధికారి విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీడీవో ఆర్.రమాదేవి, ఎంఈవో డి.పుల్లయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో నర్సింహారావు

ప్రతీ విద్యార్థి నేర్చుకునే ప్రయత్నం చేయాలి

» కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

తల్లాడ, ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టించి పంటలు పండిస్తున్న రైతుల నుంచి వ్యవసాయకళాశాల విద్యార్థులు నేర్చుకోవాల్సింది ఎంతో ఉందని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. గురువారం మండలంలోని కుర్నవల్లి రైతు వేదికలో కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వ్యవసాయకళాశాల నాలుగో సంవత్సరం విద్యార్థులకు గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవం కార్యక్రమంలో భాగంగా రైతుసదస్సు నిర్వహించారు. ముందుగా ఎగ్జిబిషన్‌ను కలెక్టర్ ప్రారంభించి స్టాల్స్‌ను పరిశీలిచారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ కొత్తగా సర్వీసులోకి వచ్చినప్పుడు అంతా తెలుసు అనుకుంటాం కానీ, ఒక్కటి కూడా తెలియదు తెలిసిన వారి దగ్గరికి వెళ్లిఏం చేస్తున్నారు, ఎలా చేస్తున్నారు, ఎందుకు ఇలా చేస్తున్నారు అనే విషయాలను నేర్చుకుంటే అప్పుడు మనమేమి చేయవచ్చో బోధపడుతుందన్నారు. తెలుసుకునే విషయంలో అహంకారం పోవాలని, నాకు తెలుసుకు నేను చెప్పేది వినండి ఎందుకు వినరనే ధోరణి పోవాలన్నారు. విద్యార్థులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి రైతులతో మమేకమై ఆధునిక సాగు పద్ధతులు పాటించేలా దిగుబడి పెరిగి నికర ఆదాయం వచ్చేలా రైతుల అభివృద్ధి కోసం అహర్నిశలు మరిన్ని సేవలందించాలని ఆదేశించారు. సదస్సులో జేడీఏ డి. పుల్లయ్య మాట్లాడుతూ అశ్వారావుపేట వ్యవసాయ కళాశల విద్యార్థులు ఉన్నత స్థాయిలో ఉన్నారని, ఇప్పుడు చదువుతున్న విద్యార్థులు కూడా రైతులకు మెరుగైన తోడ్పాటు అందించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. సదస్సులో సత్తుపల్లి ఏడీఏ శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ జే.హేమంత్‌కుమార్, వైరా కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ కె. రవికుమార్, ఏవో మహ్మద్ తాజుద్దీన్ , ఏఈవో త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలని వినతి



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

తల్లాడ, ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు రైతులు విజ్ఞప్తి చేశారు. గురువారం మండలంలోని కుర్నవల్లిలోని ధాన్యం కొనుగలు కేంద్రం కల్లంలో ధాన్యాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈసందర్భంగా రైతులు తూర్పారబట్టలేదని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కలక్టర్ మాట్లాడుతూ 17శాతం లోపు తేమ ధాన్యాన్ని నిబంధనల మేరకు కొనుగోలు చేసి ప్రభుత్వ మద్దతు ధర తోపాటు సన్నరకం ధాన్యానికి క్వింటాకు రూ.500బోనస్‌లు అందించడం జరుగుతుందన్నారు. పౌరసరఫరాల శాఖ డీఎం గంటా శ్రీలత కూడా కొనుగోలు కేద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

మిల్లర్లు లక్ష్యాలను సాధించాలి: ఆర్డీవో

కల్లూరు, ఏప్రిల్24 (ఆంధ్రజ్యోతి) రైస్‌మిల్లర్లు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని కల్లూరు ఆర్డీవో ఎల్ రాజేంద్రగౌడ్ కోరారు. గురువారం కల్లూరు డివిజన్ పరిధిలో గల రైస్ మిల్లర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యం ప్రకారం ధాన్యం దిగుమతి చేసుకోవాలన్నారు. తహసీల్దార్ సాంబశివుడు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సభను విజయవంతం చేయాలి

» మాజీ జడ్పీచైర్మన్ లింగాల కమల్‌రాజ్



మాట్లాడుతున్న కమల్‌రాజ్

ముదిగొండ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో ఈనెల 27వతేదీన జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని మాజీ జడ్పీచైర్మన్ లింగాల కమల్‌రాజ్ పిలుపునిచ్చారు. గురువారం మేడేపల్లిలోని సామినేని హరిప్రసాద్ నివాసంలో జరిగిన ముదిగొండ మండల బీఆర్ఎస్ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, మాజీ ఎంపీపీ సామినేని హరిప్రసాద్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వాచేపల్లి లక్ష్మారెడ్డి, పోట్ల వెంకటప్రసాద్, గడ్డం వెంకట్, ధర్మారావు, అనంతరాములు, నాగార్జున, భిక్షం, శంకర్ పాల్గొన్నారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి

» జేడీఏ విజయచంద్ర



మాట్లాడుతున్న ఏడీఏ విజయచంద్ర

మధిరరూరల్, ఏప్రిల్24 (ఆంధ్రజ్యోతి): రైతులు పొలాల్లో భూసార పరీక్షలు చేయించుకోవాలని వ్యవసాయశాఖ జేడీఏ విజయచంద్ర అన్నారు. గురువారం మండలంలోని మాటూరు రైతువేదికలో వ్యవసాయశాఖ, డిజిటల్ గ్రీన్ ఎన్జీవో సంస్థ వారి ఆధ్వర్యంలో భూసార పరీక్షలుపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మానవుల ఆరోగ్యానికి హెల్త్ చెకప్ ఎలానో పంట పండించే భూమికి భూసార పరీక్ష కూడా అలాంటిదేనాన్నరు. ప్రతి మూడు సీజన్లకు ఒకసారి భూసారపరీక్ష చేయించుకోవాలని రైతులకు సూచించారు. ఒకే పంట వేయడం వల్ల కలిగే నిరుపయోగాలు, ఇతర పంటల వేయడం వల్ల కలిగే లాభాలు గురించి రైతులకు వివరించారు. అంతేకాకుండా ఆయిల్‌పామ్ పంట వల్ల కలిగే ఉపయోగాల గురించి వివరించారు. ఈకార్యక్రమంలో డిజిటల్ గ్రీన్ కో ఆర్డినేటర్ యశోద, ఏవో సాయిదీక్షిత్, ఏఈవో నిఖిత పాల్గొన్నారు.

ముదిగొండ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి వేణుయాదవ్ సూచించారు. గురువారం మండలంలోని చిరుమర్రి గ్రామంలో డిజిటల్ గ్రీన్ ఆర్గనైజ్ చేసిన భూసార పరీక్షల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూసార పరీక్షలు చేయించుకోవడం వల్ల ఏఏ పంటలు అనువుగా ఉంటాయో తెలుసుకోవచ్చునన్నారు. భూములపై క్రిమిసంహారక మందుల వాడకాన్ని తగ్గించాలని సూచించారు. కార్యక్రమంలో డిజిటల్ గ్రీన్ కోఆర్డినేటర్ యశోద, ఏఈవో, రైతులు పాల్గొన్నారు.



భూసార పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

గ్రూప్-1కి అర్హత సాధించిన యువకుడికి సన్మానం



సందీప్‌ను సన్మానిస్తున్న కమ్మసేవా సంఘం నాయకులు

కల్లూరు, ఏప్రిల్24 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1లో అర్హత సాధించిన దొడ్డపనేని సందీప్ దంపతులను గురువారం కమ్మసేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు పోలీసుస్టేషన్‌లో సందీప్ సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నాడు. ఈ సందర్భంగా మండల పరిధిలోని యర్రబోయనపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో మండల కమ్మసేవా సంఘం అధ్యక్షుడు మద్దినేని రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి నున్నా వెంకటయ్యలు సందీప్, కావ్య దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాకర్ల రంగారావు, బొప్పన రామారావు, జాస్తి శ్రీనువాసరావు, బోబోలు శ్రీనువాసరావు, మండవ శ్రీనువాసరావు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏడీఏ కరుణశ్రీ

వైరా, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): వైరా వ్యవసాయ మార్కెట్‌యార్డులో రబీ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఏడీఏ తుమ్మలపల్లి కరుణశ్రీ ప్రారంభించారు. ఏడీఏ మాట్లాడుతూ ఎఫ్ఏక్యూ నిబంధనల ప్రకారం రైతులంతా తమ ధాన్యాన్ని తాలు లేకుండా తేమ 17శాతం ఉండేవిధంగా కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని సూచించారు. మండల వ్యవసాయశాఖ అధికారి మయాన్ మంజూఖాన్, డీసీఎంఎస్ ప్రతినిధి శివారెడ్డి, ఏఈవోలు రాజేష్, సైదులు, కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి రాజు, రైతులు పాల్గొన్నారు.


టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ

మధిరరూరల్, ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి): మధిరలోని టీడీపీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ కార్డులను గురువారం కార్యకర్తలకు అందించారు. టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం చేతుల మీదుగా అందించారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు మల్లాది హనుమంతరావు చేకూరు శేఖర్‌బాబు, వేమూరి సునిల్‌కుమార్, చెరుకూరి కృష్ణారావు, పుల్లారావు మేడ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



సభ్యత్వ కార్డులు అందిస్తున్న వాసిరెడ్డి రామనాథం

'జీవితంలో లక్ష్యాన్ని ఏర్పరచుకోవాలి'



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్24 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి తన జీవితంలో లక్ష్యాన్ని ఏర్పరచుకోవాలని మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చలసాని హరికృష్ణ అన్నారు. తమ కళాశాలలో బీటెక్ ఫైనలియర్ చదువుతున్న ఏడుగురు విద్యార్థులకు సింగపూర్‌కు చెందిన కంపనీ ఏమోటెక్ పీటీఈ లిమిటెడ్‌లో పైతాన్ ఫుల్‌స్టాక్ డెవలపర్‌గా రూ.4.5లక్షల వార్షిక వేతనానికి ఎంపికైనట్లు గురువారం తెలిపారు. కార్యక్రమంలో సెక్రటరీ, కరస్పాండెంట్ చలసాని సాంబశివరావు, చైర్మన్ కంచర్ల సత్యనారాయణ, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ ఏటీ.శ్రీనివాసరావు, ఇంజనీరింగ్ డీన్ డాక్టర్ జాకీర్ హుస్సేన్, ఐక్యూ ఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎంవీ.రామచంద్రరావు, సీఎస్సీ విభాగం అధిపతి పీ.మారేశ్వరరావు, ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ అధికారి టీ.రాఘవరాజు పాల్గొన్నారు.

ఉద్యోగుల ర్యాలీని విజయవంతం చేయాలని ప్రచారం

కారేపల్లి ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు రావాల్సిన రాయితీలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ శుక్రవారం ఖమ్మంలో జరగనున్న బైక్ ర్యాలీని జయప్రదం చేయాలని డిమాండ్ చేస్తూ ప్రచారం నిర్వహించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా జాయింట్ యాక్షన్ కమిటీ ప్రధాన కార్యదర్శి రవీంద్రప్రసాద్, ఎంపీడీవో సురేందర్‌లు ప్రచా రం నిర్వహించారు. ఈసందర్భంగా రవీంద్రప్రసాద్ మాట్లాడుతూ బైక్‌ర్యాలీ ఐడీవోసీ నుంచి టీఎన్‌జీఓ సమావేశ మందిరం వరకు జరుగుతుందని, ర్యాలీలో అన్ని ఉద్యోగసంఘలకు చెందిన వారు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



ప్రచారం నిర్వహిస్తున్న ఉద్యోగులు



గౌతమికి స్వీట్ తినిపిస్తున్న మాజీ జడ్పీటీసీ బాణోతు కొండ

ఆర్థికసాయం అందజేత

బోనకల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రావినూతల గ్రామానికి చెందిన చేబ్రోలు గౌతమి ఇంటర్ మొదటి సంవత్సరంలో 470కిగానూ 467మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబర్చింది. ఈ విద్యాసంవత్సరంలోనే తల్లిదండ్రులిద్దరూ మృతిచెందిన ఆబాధను దిగమింగుకొని ప్రతిభ చాటిన గౌతమికి ఆమె తండ్రి సైదా మిత్రబృందం, మాజీ జడ్పీటీసీ బాణోతు కొండ ఆధ్వర్యంలో గురువారం రూ.30వేల సాయం అందించారు. కార్యక్రమంలో బాదావత్ హుస్సేన్, నీలకంఠం రాము, మోదుగు శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, బాణోతు మురళీ, తేళ్లూరి రమేష్ పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ

మధిరరూరల్, ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి): మండలంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠను గురువారం వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో కమిటీసభ్యులు పాల్గొన్నారు.

